


తెలుగు వార్త వార పత్రిక

RNI : APTEL/2006/16523

# సత్తెనపల్లి న్యూస్

సామాజిక హితం | ప్రజాప్రగతి

సంపుటి : 21 | సంచిక : 37 | 14.9.2026 నుంచి 20.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 3 | sapnews.in@gmail.com |






# స్థానిక ఎన్నికలే ‘మినీ వార్’..

- గెలుపు కోసం కూటమి కసరత్తు
- లోకల్ ఫైట్‌లో కూటమికి ఇంత టెన్షనా!?
- 90 శాతం గెలుపే టార్గెట్.. టీడీపీకి ఎందుకింత పట్టుదల?
- లోకల్ పోరు.. కూటమి భవిష్యత్‌కు పరీక్షా..
- వైసీపీ పుంజుకుంటే.. కూటమికి కౌంట్‌డౌన్ మొదలవుతుందా!
- చంద్రబాబు ‘90 శాతం’ టార్గెట్ వెనుక అసలు కథేంటి?

సత్తెనపల్లి న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికలు ఏపీ రాజకీయాల్లో మరోసారి వేడి పుట్టించబోతున్నాయి. వచ్చే స్థానిక పోరులో అన్ని చోట్లా కూటమి అభ్యర్థులే గెలవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా అధికార పార్టీకి స్థానిక ఎన్నికల్లో కొంత అనుకూలత ఉండటం సహజమే. అయితే ఈసారి మాత్రం కూటమి నాయకత్వం ‘సంపూర్ణ విజయం’ అనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వెనుక రాజకీయ లెక్కలు ఉన్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికల సమయంలో టీడీపీ బహిష్కరణకు దిగిన సందర్భాలు ఉండగా.. ఇప్పుడు అదే టీడీపీ స్థానిక పోరును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు వైసీపీ మాత్రం ఫలితాలతో సంబంధం లేకుండా బరిలో నిలిచి తీరుతామని చెబుతోంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలు కేవలం గ్రామ, మండల, జిల్లా స్థాయి ఎన్నికలుగా కాకుండా.. రెండు ప్రధాన పార్టీల మధ్య రాజకీయ బలాబలాల పరీక్షగా మారే అవకాశం కనిపిస్తోంది.

## సగం పాలనకు చేరువలో.. స్థానిక ఫలితాలపై ఎందుకింత ఫోకస్?

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నరేళ్లు పూర్తికావస్తున్నాయి. అంటే ఐదేళ్ల పాలనలో సగం దశకు చేరువలో ఉన్నట్టే. ఈ సమయంలో జరిగే స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయానికి ఒక రాజకీయ సూచికగా మారే అవకాశం ఉంది. ఇటీవల టీడీపీ నేతల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. తాను తరచూ సర్వే నివేదికలు తెప్పించుకుంటున్నానని, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉందని చెప్పడం గమనార్హం. అంతేకాదు.. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చిన ఫలితాల కంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. ఇక్కడే అసలు రాజకీయ లెక్క మొదలవుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## వైసీపీకి 40 శాతం వస్తే..!?

స్థానిక ఎన్నికల్లో వైసీపీ గణనీయమైన స్థాయిలో ఫలితాలు సాధిస్తే.. అది ఆ పార్టీకి కేవలం కొన్ని స్థానాల విజయం మాత్రమే కాదని టీడీపీ భావిస్తే, ఆ ఫలితాలు భవిష్యత్ రాజకీయాలకు సంకేతంగా మారే అవకాశం ఉంది. ఉదాహరణకు వైసీపీకి 30-40 శాతం స్థాయిలో స్థానిక ఫలితాలు అనుకూలంగా వస్తే, ఆ పార్టీ తిరిగి పుంజుకుంటోందనే ప్రచారం ఊపందుకోవచ్చు. అదే సమయంలో కూటమి నేతల్లోనూ రాజకీయ భవిష్యత్తుపై లెక్కలు మొదలయ్యే అవకాశం ఉంటుంది. అందుకే వైసీపీకి ఏ మాత్రం బలం చేకూరినా.. దాని ప్రభావం స్థానిక ఎన్నికలకే పరిమితం కాకుండా 2029 రాజకీయాలపై కూడా పడొచ్చనే భయం కూటమి శిబిరంలో ఉందనే చర్చ సాగుతోంది.

## ‘ఏకగ్రీవం’ కూడా వద్దంటున్న జగన్

మరోవైపు వైసీపీ అధినేత జగన్ కూడా పార్టీ శ్రేణులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఒక్క ఏకగ్రీవం కూడా జరగకుండా పోటీకి సిద్ధం కావాలని పార్టీ నేతలను కోరినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఫలితంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు రాజకీయ పోరు మరింత తీవ్రం కానుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## స్థానిక ఎన్నికలు.. అధికారానికి రిఫరెండమా?

స్థానిక ఎన్నికలు కేవలం టీడీపీ, వైసీపీ మధ్య పోటీ కాదు. అవి ప్రజలకు సంబంధించిన ఎన్నికలు. అధికార పార్టీకి అనుకూలంగా వచ్చినా, ప్రతిపక్షానికి అనుకూలంగా వచ్చినా.. ఆ ఫలితాల్లో ప్రజల తీర్పు ప్రతిబింబించాల్సిందే. వైసీపీ గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులే 2024లో ఆ పార్టీని తీవ్రంగా దెబ్బతీశాయనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. అదే విధంగా అధికారంలో ఉన్నామనే ధీమాతో ప్రజాస్వామ్య విలువలను పక్కన పెడితే.. చరిత్ర పునరావృతం కావడానికి ఎక్కువ సమయం పట్టదనే హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి.

## 90 శాతం లక్ష్యం.. ఎందుకు?

సాధారణంగా అధికార పార్టీ స్థానిక ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించడం కొత్తేమీ కాదు. కానీ ఈసారి కూటమి లక్ష్యం 90 శాతానికి పైగా విజయాలు సాధించడమన్న స్థాయిలో ఉండటం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ఇంత భారీ విజయం సాధించాలనే పట్టుదల వెనుక.. కేవలం స్థానిక సంస్థలను చేజిక్కించుకోవాలనే లక్ష్యమే కాకుండా, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత లేదని రాజకీయంగా నిరూపించుకోవాలనే ప్రయత్నం కూడా ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే.. అది ప్రతిపక్షానికి కొత్త ఊపునివ్వడమే కాకుండా, అధికార కూటమిలోనూ రాజకీయ లెక్కలను మార్చే అవకాశం ఉంటుంది.



## అసలు పరీక్ష ఇప్పుడే..

అధికారంలో ఉన్నప్పుడు ప్రజల తీర్పును ఎదుర్కోవడం ఏ పాలకుడికైనా కీలకమే. సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగే ప్రతి ఎన్నికా ఒక రకంగా ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతుంది. అందుకే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎవరు ఎన్ని స్థానాలు గెలిచారనే దానికంటే.. ప్రజలు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే విషయాన్ని స్పష్టం చేసే రాజకీయ పరీక్షగా మారనున్నాయి. కూటమికి ఇది బలాన్ని నిరూపించుకునే అవకాశం.. వైసీపీకి పుంజుకుంటున్నామనే సంకేతం ఇచ్చే అవకాశం. అందుకే ఈసారి స్థానిక పోరు.. సాధారణ ఎన్నికలకంటే ముందే జరిగే ‘మినీ పొలిటికల్ వార్’గా భావిస్తున్నారు.






## పల్నాడులో ‘ఆరా స్కిన్ ఏస్తెటిక్స్’ ఘన ప్రారంభం



నరసరావుపేట (ఎస్‌పిఎఎన్) : పల్నాడు జిల్లా కేంద్రంలో ‘ఆరా స్కిన్ ఏస్తెటిక్స్’ నూతన శోభతో అందుబాటులోకి వచ్చింది. ఆధునిక స్కిన్ & హెయిర్ ట్రీట్‌మెంట్స్, అడ్వాన్స్‌డ్ లేజర్ వైద్యం, పర్మనెంట్ మేకప్‌తో పాటు పలు చర్మ సంబంధిత సమస్యలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో నాణ్యమైన చికిత్సలు అందిస్తున్నట్లు నిర్వాహ కులు తెలిపారు. ఈ నూతన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు (శుక్ల), దర్శి టీడీపీ ఇంచార్జ్ లక్ష్మి ముఖ్య అతిథు లుగా హాజరై ప్రారంభించారు. స్థానిక ప్రజలు ఈ అత్యాధు నిక చర్మ సంరక్షణ సేవలను వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.



# డీఎస్సీ వివాదం.. కూటమికి రాజకీయ చిక్కుముడి?



అమరావతి : అపరిమిత అధికారం చేతిలో ఉంటే అహంకారం పెరుగుతుందా..? తప్పు జరిగిందన్న ఆరోపణలు వచ్చినప్పుడు దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కంటే ఎదురుదాడికే పాలకులు ప్రాధాన్యం ఇస్తే.. అదే చివరకు రాజకీయంగా ప్రతిపక్షానికి ఆయుధంగా మారుతుందా..? ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల వివాదం చుట్టూ జరుగుతున్న పరిణామాలు ఈ ప్రశ్నలనే తెరపైకి తెస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఉన్న సమయంలో.. కేవలం 11 ఎమ్మెల్యే స్థానాలకే పరిమితమైన వైసీపీ చేసే ఆరోపణలను ఎందుకు పట్టించుకోవాలనే ధోరణి అధికార పక్షంలో కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే రాజకీయంగా బలహీనంగా కనిపించే ప్రతిపక్షం చేసే ఆరోపణలకు ప్రజల్లో స్పందన వస్తే.. ఆ ఆరోపణలను కొట్టిపారేయడం కంటే వాస్తవాలతో సమాధానం చెప్పడమే ప్రభుత్వానికి మేలు చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మెగా డీఎస్సీ-2025లో స్పోర్ట్స్ కోటా నియామకాల వ్యవహారం ఇప్పుడు వైసీపీకి కీలక రాజకీయ అంశంగా మారింది. ఎలాంటి పరీక్ష లేకుండానే స్పోర్ట్స్ కోటాలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం రెండు జీవోలు జారీ చేయడం.. నియామకాలు పూర్తయిన తర్వాత వాటిని రద్దు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని ప్రతిపక్షం పదేపదే ప్రశ్నిస్తోంది.

- అధికార అహంకారమే జగన్‌కు అస్త్రంగా మారిందా..?
- స్పోర్ట్స్ కోటా నియామకాలపై పెరుగుతున్న అనుమానాలు..
- సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే..

### 'ఆ వ్యక్తికి ఉద్యోగం ఎందుకు ఇవ్వలేదు?'

స్పోర్ట్స్ కోటాలో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించిన అభ్యర్థికి ఉద్యోగం ఎందుకు దక్కలేదన్న ప్రశ్నను వైఎస్ జగన్, వైసీపీ నేతలు కొంతకాలంగా లేవనెత్తుతున్నారు. దీనిపై ప్రభుత్వం మాత్రం సర్టిఫికెట్ల పరిశీలనకు సంబంధిత అభ్యర్థి హాజరుకాలేదని వివరణ ఇస్తోంది. అయితే ఉద్యోగం దక్కలేదంటూ సదరు అభ్యర్థి హైకోర్టును ఆశ్రయించిన అంశాన్ని వైసీపీ నేతలు ప్రస్తావిస్తూ ప్రభుత్వ వివరణను ప్రశ్నిస్తున్నారు. ఇక్కడే అసలు సమస్య మొదలవుతోంది. ఆరోపణలు నిజమా? ప్రభుత్వ వివరణ సరైన దేనా? నియామక ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించారా? అర్హత ఉన్న అభ్యర్థులకు అన్యాయం జరిగిందా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లభిస్తే వివాదానికి తెరపడే అవకాశం ఉంది. కానీ సమాధానాల స్థానంలో రాజకీయ ఎదురుదాడి కొనసాగితే మాత్రం అనుమానాలకు మరింత బలం చేకూరుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రెండు జీవోలు.. ఆ తర్వాత రద్దు

ఈ వివాదంలో అత్యంత కీలకంగా మారిన అంశం స్పోర్ట్స్ కోటా నియామకాలకు సంబంధించిన రెండు జీవోలు. పరీక్ష నిర్వహించకుండానే నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత అదే జీవోలను రద్దు చేయడం ఎందుకు జరిగిందన్న ప్రశ్నకు ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాల్సి ఉంది. ఇది సాధారణ పరిపాలనా నిర్ణయమా..? న్యాయ పరమైన లేదా సాంకేతిక కారణాలతో తీసుకున్న నిర్ణయమా..? లేక నియామక ప్రక్రియలో ఏదైనా లోపాన్ని గుర్తించిన తర్వాత రద్దు చేశారా..? అనే విషయాలను ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా చెప్పాల్సి ఉంది.

### జగన్‌కు రాజకీయంగా కలిసొస్తున్న అంశం

ఇప్పటికే నియామకాలు, పరీక్షల విషయంలో దేశవ్యాప్తంగా యువతలో అనుమానాలు, ఆగ్రహం పెరిగిన పరిస్థితుల్లో డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వివాదం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకసారి నియామక ప్రక్రియపై అనుమానం ఏర్పడితే.. ప్రతి నిర్ణయాన్ని ప్రజలు నిశితంగా పరిశీలించే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వంపై వచ్చిన ఆరోపణలను కేవలం వైసీపీ ఆరోపణలుగా కొట్టిపారేయడం కంటే.. పారదర్శకంగా వివరాలు వెల్లడించడం, అవసరమైతే స్వతంత్ర విచారణకు సిద్ధపడటం ప్రభుత్వానికే రాజకీయంగా మేలు చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ 'వైసీపీ అడిగిందని మేమెందుకు విచారణకు ఆదేశించాలి?' అనే ధోరణి ప్రభుత్వానికి ప్రతికూలంగా మారే ప్రమాదం ఉంది. ఎందుకంటే విచారణ కోరుతున్నది ఎవరు అన్నదానికంటే.. ఆరోపణల్లో వాస్తవం ఉందా లేదా అన్నదే ప్రజలకు ముఖ్యం.

### అధికారమే అస్త్రంగా మారకూడదు!

ప్రభుత్వానికి అధికారం ఉండటం సహజం. అయితే ఆ అధికారాన్ని విమర్శలను అణచివేయడానికి కాకుండా.. సందేహాలను నివృత్తి చేయడానికి ఉపయోగించినప్పుడే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రశ్నించిన ప్రతిసారీ ఎదురుదాడి చేయడం, విమర్శలను రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం వల్ల అసలు అంశం పక్కకు వెళ్లి.. ప్రభుత్వ ధోరణే చర్చనీయాంశంగా మారే ప్రమాదం ఉంది. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వివాదంలోనూ అదే జరుగుతోందన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. ప్రభుత్వం ఎంత త్వరగా స్పష్టమైన వివరణ ఇస్తే అంత త్వరగా ఈ వివాదానికి ముగింపు పలకవచ్చు. లేకపోతే ఇదే అంశాన్ని వైఎస్ జగన్ మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది.

### రాజకీయంగా కూటమికి ఇదో హెచ్చరిక

ప్రతిపక్షం బలహీనంగా ఉన్నప్పుడు అధికార పక్షం మరింత బాధ్యతగా వ్యవహరించాలి. ఎందుకంటే బలమైన ప్రతిపక్షం లేకపోయినా.. ప్రజల ప్రశ్నలు ఉంటాయి. సామాజిక మాధ్యమాలు ఉన్నాయి. న్యాయ స్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంది. చివరికి ప్రజల తీర్పు ఉంటుంది. అందుకే డీఎస్సీ స్పోర్ట్స్ కోటా వివాదం కేవలం వైసీపీ-కూటమి రాజకీయ పోరాటంగా చూడటం ప్రభుత్వానికి ప్రమాదకరమే. ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రభుత్వం భావిస్తే.. పూర్తి వివరాలతో ప్రజల ముందుకు రావాలి. తప్పు జరిగితే సరిదిద్దుకోవాలి. అవసరమైతే స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఎదురుదాడి కంటే.. సమాధానం చెప్పే సామర్థ్యమే అసలైన బలం. డీఎస్సీ వివాదంలో కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ బలాన్ని ప్రదర్శించాల్సిన సమయం వచ్చింది.

## ఫైళ్ల క్లియరెన్స్ ఆలస్యం ఎందుకు?

- వాట్సప్ మెసేజ్‌లపై చూపిస్తున్న శ్రద్ధ శాఖాపరమైన దస్త్రాల మీద ఉండదా!
- సీఎం అసహనం



**అమరావతి:** వాట్సప్ మెసేజ్‌లపై చూపిస్తున్న శ్రద్ధ శాఖాపరమైన దస్త్రాల క్లియరెన్స్‌పై ఎందుకు ఉండటం లేదంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్లు లేకుండా కొన్ని గంటలు కూడా ఉండలేకపోతున్నారా అని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ల సదస్సుకు గైర్హాజరు కావడానికి ఎంత ధైర్యం అని మండిపడ్డారు. మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడీలు, జిల్లా కలెక్టర్ల స్థాయిలో ఫైళ్లు క్లియర్ కావడానికి పడుతున్న సమయాన్ని సీఎం స్వయంగా వెల్లడిస్తూ.. నిర్ణయాల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోనని స్పష్టం చేశారు. హెచ్ఓడీల వద్ద దస్త్రాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని నిలదీసిన సీఎం.. ఫైళ్లు పెండింగ్‌లో పెట్టే అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అధికారుల పనితీరుపై 360 డిగ్రీల ఒపీనియన్లు తీసుకుంటానని హెచ్చరించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కొల్లు రవీంద్ర, పయ్యావుల కేశవ్ వద్ద దస్త్రాల క్లియరెన్స్‌కు ఎక్కువ సమయం పడుతోందని సీఎం ప్రస్తావించారు. తాను కూడా కొన్ని ఫైల్స్ క్లియర్ చేయడానికి నాలుగు రోజులు తీసుకుంటున్నానని చెప్పిన చంద్రబాబు.. హోంమంత్రి సహా ప్రతి ఒక్కరూ నిర్ణయాల వేగాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వంలో ఫైల్ కదలికకు పట్టే ప్రతి రోజు పాలనపై ప్రభావం చూపుతుందని, అధికారులు వేగంగా స్పందించి ప్రజలకు, ప్రభుత్వానికి ఫలితాలు అందించేలా పనిచేయాలని స్పష్టం చేశారు.

## ఆర్భాటం వద్దు.. భక్తే ముద్దు!

"విఘ్నాలు తొలగించే దేవుడిని నేను.. కానీ మీ ఆర్భాటాలే సామాన్యుల జీవితాలకు విఘ్నాలుగా మారుతున్నాయి. నన్ను భారీ విగ్రహాల్లో కాదు.. స్వచ్ఛమైన భక్తిలో చూడండి" అన్న సందేశం ఇప్పుడు ప్రతి వినాయక భక్తుడూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఓ వైపు ధరలు భగ్గుమంటుండగా.. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో జలవనరులు ఒట్టిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పండగ పేరుతో దుబారా, నీటి వృథా, కాలుష్యానికి తావివ్వకుండా పర్యావరణహితంగా వినాయక చవితిని నిర్వహించుకోవాల్సిన సమయం వచ్చింది.

### ఎల్‌నినో వేళ గంగమ్మను కాపాడుకుందాం..

- కాలుష్యం కాదు.. ప్రకృతి పరిరక్షణ కావాలి!
- మండపాల్లో మంత్రాలు వినిపించాలి.. డీజేల మోత కాదు!
- భారీ విగ్రహాలు, డీజేలు, దుబారా వేడుకలకు దూరంగా ఉండండి
- "నా విగ్రహాన్ని నిమజ్జనం చేయడానికి నీరు లేకుండా పోతోంది..





### భక్తులారా.. నా మాట వినండి!

గరికతో పూజించినా చాలు.. భక్తితో పూజిస్తే కరుణిస్తా. నా కోసం భారీ విగ్రహాలు అవసరం లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్భాటంగా వేడుకలు నిర్వహించాల్సిన అవసరం అంతకంటే లేదు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన భారీ విగ్రహాలను నదులు, చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమవుతుంది. పూడిక పెరుగుతుంది. జలవనరులపై మరింత భారం పడుతుంది. అసలే నీటి ఎద్దడి ఉన్న సమయంలో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా వృథా చేయడం ఎంతవరకు సమంజసం?

### మట్టి వినాయకుడిని పూజించండి.. మట్టి కళాకారుడిని ప్రోత్సహించండి

ఒకరిని చూసి మరొకరు పోటీపడి భారీ విగ్రహాలు ఏర్పాటు చేయడం కంటే.. ప్రకృతికి మేలు చేసే మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడం గొప్ప భక్తి. మరోవైపు నవరాత్రి వేడుకల పేరుతో భారీ మండపాలు ఏర్పాటు చేసి వీధులు, రోడ్లను మూసేస్తున్నారు. ఇప్పటికే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న నెల్లూరు నగరంలో ఈ వేడుకలు సామాన్యులకు మరింత ఇబ్బందిగా మారకూడదు. మండపాల వద్ద సినిమా పాటలు, డీజేలతో భారీ శబ్దాలు చేస్తూ ధ్వనికాలుష్యాన్ని పెంచడం భక్తి కాదు. పూజలందుకోవాల్సిన వినాయకుడి పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం సరైన పద్ధతి కాదు.

### విఘ్నాలను తొలగించే దేవుడిని నేను.. నా పేరుతోనే కొత్త విఘ్నాలు సృష్టించకండి!

ఎల్‌నినో ప్రభావంతో ఇప్పటికే గంగమ్మకు కష్టకాలం మొదలైంది. కొన్ని చెరువుల్లో నిమజ్జనానికి సరిపడా నీరు కూడా లేని పరిస్థితి. జలాశయాల్లో నీటిమట్టాలు పడిపోతున్నాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోతే వచ్చే వేసవిలో పరిస్థితులు మరింత గడ్డుకాలంగా మారే అవకాశం ఉంది. అందుకే ఇప్పుడే జాగ్రత్త పడాలి. ఉన్న జలవనరులను కాపాడుకోవాలి. భారీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను కొనుగోలు చేసి చెరువుల్లో నిమజ్జనం చేస్తే భవిష్యత్తులో నీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. నా విగ్రహం వల్ల మీకు నీటి కష్టం రావడం నేను కోరుకోను.

## పాదయాత్ర 2.0కు జగన్ కసరత్తు!




**అమరావతి:** వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ పాదయాత్రకు ఆయన ముహూర్తం ఖరారు చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. 2027 సెప్టెంబరు లేదా అక్టోబరులో 'పాదయాత్ర 2.0' ప్రారంభిస్తానని బుధవారం పర్చూరు నియోజకవర్గ పార్టీ కేడర్‌తో జరిగిన సమావేశంలో స్పష్టం చేసినట్లు తెలిసింది. 2029 అసెంబ్లీ ఎన్నికల ను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే పార్టీని క్షేత్రస్థాయిలో బలోపే తం చేయాలని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగం గానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు.. పార్టీ శ్రేణుల్లో నూతనో త్సాహం నింపేందుకు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం.

**మళ్లీ ప్రజల మధ్యకే..** గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్ చేపట్టిన 'ప్రజా సంకల్ప యాత్ర' వైఎస్సార్‌సీపీ రాజకీయ ప్రస్థానాన్ని మలుపుతిప్పింది. 2017 నవంబరు 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నుంచి ఆయన యాత్ర ప్రారంభించారు.

సుమారు 341 రోజులపాటు 3,648 కిలోమీటర్లు సాగిన ఆ యాత్రలో 13 జిల్లాల్లోని 134 అసెంబ్లీ నియోజకవర్గాలు, 2,516 గ్రామాల మీదుగా జగన్ పర్యటించారు. రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులు, వివిధ సామాజిక వర్గాల ప్రజలను నేరుగా కలుసుకున్నారు.

**నాడు పాదయాత్ర.. నేడు అధికార పీఠం :** ప్రజా సంకల్ప యాత్రలో ప్రజా సమస్యలను తెలుసుకుంటూనే.. అధికారంలోకి వస్తే అమలు చేయబోయే నవరత్నాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారు. దాదాపు రెండు కోట్ల మంది ప్రజలతో మమేకమైనట్లు వైఎస్సార్‌సీపీ పేర్కొంది. ఆ యాత్ర ముగిసిన కొద్ది నెలలకే జరిగిన 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించింది. మొత్తం 175 స్థానాలకు గాను 151 స్థానాలు కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

**2029పై గురి..** ఇప్పుడు పరిస్థితులు మారాయి. 2024 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయిలో పునర్వ్యవస్థీకరణ సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో మరోసారి పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లి పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలని జగన్ భావిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 2027 సెప్టెంబరు-అక్టోబరు నాటికి పాదయాత్ర ప్రారంభించి, 2029 ఎన్నికల నాటికి పార్టీని పూర్తి స్థాయిలో ఎన్నికల సమరానికి సిద్ధం చేయాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. జగన్ ప్రకటనతో వైఎస్సార్‌సీపీ కేడర్‌లో పాదయాత్రపై ఆసక్తి మొదలైంది.

- ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు అమ్మినా చర్యలు..
- గడువు ముగిసిన షాపుల పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధం..
- సీసీ కెమెరాలకు కృత్రిమ మేధ అనుసంధానం..
- ఉల్లంఘనలు జరిగితే అధికారులకు అలర్ట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విక్రయాలపై ప్రభుత్వం మరింత పటిష్ఠమైన నిఘా వ్యవస్థను తీసుకురానుంది. మద్యం దుకాణాల కేటాయింపుతో పాటు విక్రయాల తీరులోనూ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ఎక్సైజ్ శాఖ సిద్ధమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన కొత్త మద్యం విధానంలో భాగంగా కేటాయించిన దుకాణాల రెండేళ్ల గడువు పూర్తికావడంతో.. వాటి పునరుద్ధరణతో పాటు అమ్మకాలపై మరింత పారదర్శకత తీసుకురావాలని నిర్ణయించింది.




# మద్యం అమ్మకాలపై ఏఐ నిఘా?

## రెన్యువల్‌కు గ్రీన్‌సిగ్నల్..

గడువు ముగియనున్న మద్యం దుకాణాల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం ప్రకటించారు. ప్రస్తుతం ఎన్ని మద్యం దుకాణాలు ఉన్నాయో.. వాటినే రెన్యువల్ చేయనున్నట్లు తెలిపారు. మద్యం పాలసీని పక్కాగా అమలు చేస్తూ విక్రయాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేయడానికి వీల్లేదని సీఎం స్పష్టం చేశారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా నియోజకవర్గాల్లో మద్యం విక్రయాల్లో అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనా ఉందని స్పష్టం చేశారు.

## షాపుల్లో ఏఐ కన్ను..

ఇక మద్యం విక్రయాలపై నిఘాను మరింత పెంచేందుకు ఎక్సైజ్ శాఖ కృత్రిమ మేధను రంగంలోకి దించుతోంది. రాష్ట్రంలోని మద్యం దుకాణాల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏఐ వ్యవస్థతో అనుసంధానం చేయనున్నారు. దీంతో మద్యం దుకాణాల పనివేళలు, అమ్మకాల తీరు, నిబంధనల ఉల్లంఘనలు తదితర అంశాలపై నిరంతర నిఘా ఉండనుంది. నిర్ణయించిన సమయానికి ముందే షాపు తెరిచినా.. గడువు ముగిసిన తర్వాత కూడా విక్రయాలు కొనసాగించినా ఏఐ వ్యవస్థ గుర్తించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయనుంది.

## ప్రతి సీసాపైనా స్కానింగ్..

కొత్త మద్యం పాలసీలో మరో కీలక మార్పునూ తీసుకురానున్నారు. మద్యం దుకాణాల్లో విక్రయించే సీసాలను స్కాన్ చేయడాన్ని తప్పనిసరి చేయనున్నారు. ప్రతి విక్రయాన్నీ సాంకేతికంగా నమోదు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. దీంతో మద్యం విక్రయాల్లో జరిగే అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, అనుమతించిన సమయాలకు భిన్నంగా నిర్వహించే విక్రయాలు వంటి అంశాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా గుర్తించే అవకాశం ఉంటుంది.

## 'ఒక్క రూపాయి' కూడా అదనంగా వద్దు..

మద్యం విక్రయాల్లో వినియోగదారుల నుంచి ఎమ్మార్పీ కంటే అదనంగా వసూలు చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త విధానంలో సీసా స్కానింగ్, సీసీ కెమెరాలు, ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థలను సమన్వయం చేయడం ద్వారా విక్రయ ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. మద్యం షాపు నుంచి విక్రయ కౌంటర్ వరకు.. ఇక సాంకేతిక నిఘా తప్పదన్న సంకేతాలను ప్రభుత్వం ఇస్తోంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు భారీ వర్షం



విశాఖపట్నం: బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం ఉదయం 5.30 గంటలకు ఉత్తర బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

అలాగే, అల్పపీడనం ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉండటంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రానున్న 48 గంటల పాటు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించింది. ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని పేర్కొంది. దీంతో సముద్రంలో అలలు ఎగసిపడే అవకాశం ఉందని తెలిపింది. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు కోరారు.

మరోవైపు.. తెలంగాణలో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. గురువారం (సెప్టెంబర్ 10) రాష్ట్రవ్యాప్తంగా వేడి, ఉక్కపోత పరిస్థితులు కొనసాగుతూనే.. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పలుచోట్ల అక్కడక్కడా వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు వర్షాలు, పిడుగులతో కూడిన ఉరుములు కనిపించే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, ఆదిలాబాద్, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, నల్గొండ జిల్లాల్లో మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. మిగతా జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.

సెప్టెంబర్ 11, 12 తేదీల్లో రాష్ట్రానికి భారీ వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు, బలమైన గాలుల హెచ్చరికను వాతావరణ శాఖ జారీ చేసింది. సెప్టెంబర్ 13న కూడా ఉరుములు, మెరుపులు, బలమైన గాలుల హెచ్చరిక కొనసాగనుంది. ఇక, హైదరాబాద్‌లోనూ మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉంది.

# కంటతడి పెట్టిన బొత్స

- కార్యకర్తల అభిమానం చూసి భావోద్వేగానికి గురైన సత్తిబాబు
- నమ్మినవాడే వెన్నుపోటు పొడిచాడని ఆగ్రహం వ్యక్తం చేసిన నాయకులు
- మేమంతా మీ వెంటేఉంటామంటూ బొత్స కి భరోసా
- నాయకుల , కార్యకర్తలలో ఉప్పొంగిన ఆప్యాయతను చూసి కన్నీరుకార్చిన బొత్స
- చీపురుపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆసక్తికర చర్చ
- ఇకపై అన్నీ నేనే చూసుకుంటానన్న బొత్స సత్యన్నారాయణ
- ఎవర్నీ కలవాల్సిన పనిలేదని క్యాడర్‌కి స్పష్టీకరణ



చీపురుపల్లి : బొత్స సత్యన్నారాయణ. అదొక బ్రాండు. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. అవమానాలనూ అనుభవించారు. రాజకీయంగా ఎత్తుపల్లాలనూ చవిచూశారు. దిగాల్సి వచ్చినప్పుడు దిగారు. తల ఎత్తాల్సి వచ్చినప్పుడు ఎత్తారు. వెలుగు నీడలు ఆయనకి కొత్తేమి కాదు. ప్రతీ సారీ పోరాడారు. ఒక్కోసారి ఓడిపోయారు. కాని, గెలుపు ప్రయత్నాన్ని విరమించలేదు. సుదీర్ఘకాల పోరాట పటిమే...ఉత్తరాంధ్రాలో మేరునగధీరుడిగా మార్చింది. గంభీరత ఆయన సొంతం. లోతైన మనస్తత్వం. ఏది ఆలోచన చేసినా దానికొక నిర్దేశిత లక్ష్యం. అందుకే అందరికీ అన్న అయ్యారు. నేడు పెద్దాయన అని పిలిపించుకుంటున్నారు. అంతటి శక్తిసామర్థ్యాలు కలిగిన నాయకుడు ఒక్కసారిగా ఉద్వేగానికి లోనయ్యారు. కన్నీటి పర్యంతం అయ్యారు. ఉప్పొంగిన కార్యకర్తలను ప్రేమాభిమానాలను చూసి మురిసిపోయారు. ఇన్నేళ్ళుగా ఒకరి చేతిలో పెట్టి, కొంత మేర ఎడబాటు కొనసాగినా తగ్గని అభిమానానికి దాసోహం అయ్యారు. "మీరు నమ్మిన వాళ్లు మిమ్మల్ని వెన్నుపోటు పొడవచ్చు...మీకు మేము ఉన్నాం. మీ మీద మా ప్రేమ ఎప్పటికీ తరగనిది" అన్న మాట ప్రతిధ్వనించడంతో ఒక్కసారిగా బొత్స తన్మయత్వం చెందారు. అంతలోనే నిబాయించుకుని నిలదొక్కుకుని "మీరెవ్వరూ అధైర్యపడవద్దు. నేను ఉన్నాను. అన్నీ నేనే చూసుకుంటాను. ఇకపై మీరు ఎవరికి వద్దకి వెళ్లాల్సిన పనిలేదు" అని చెప్పడంతో కరతాళధ్వనులతో ఆ ప్రాంతం కొత్త ఉత్సాహం పరవళ్లుతొక్కింది.

ఈ సన్నివేశం ఎక్కడో కాదు. తన సొంత నియోజకవర్గమైన చీపురుపల్లిలో చోటుచేసుకుంది. పరస్పరం ధైర్యం చెప్పుకోవడానికి కారణం చిన్నశ్రీను పార్టీ వీడడం. పార్టీ వీడడం అనే కంటే బొత్సని వదలడం. వాస్తవానికి ఎన్నికల వేళ అటు వాళ్లు ఇటు, ఇటు వాళ్లు అటూ దూకడం అత్యంత సహజం. కాని, చిన్నశ్రీను మారడం వాటికి అతీతం. సత్తిబాబు అంటే చిన్న శ్రీను, చిన్నశ్రీను అంటే సత్తిబాబు. సత్తిబాబు వేలుపట్టుకుని నడిచిన వాడు. బావ మనసును ఎరిగినవాడు. కష్టసాధ్యమైన వాటిని కూడా బావ వేసిన స్కెచ్ ని మేరకు చక్కబెట్టుకుని వచ్చేవాడు. అందుకే బొత్స తరువాత బొత్స అంతటి వాడిగా జిల్లాకి పరిచయం అయ్యారు. చీపురుపల్లి నియోజకవర్గానికి అయితే చిన్న శ్రీనే బొత్స. ఆ నియోజకవర్గంలో చిన్నశ్రీను చెప్పిందే జరిగేది. ఆయన వద్దంటే వద్దే. అంతలా బొత్స చిన్నశ్రీనుని నమ్మారు. ఆయన చొరవనూ, దూకుడినీ ప్రోత్సహించారు. ఎంత మంది చిన్నశ్రీను గురించి చెప్పినా చెవికి చేర్చేవారు కాదు. ఏమీ పట్టనట్లుగా ఉండేవారు. తొలికాలంలో తనతో నడిచిన వాళ్లు, తాను అంటే ప్రేమను చూపిన వారు తరువాత కాలంలో నెమ్మదించినా, పక్కకు జరిగినా కూడా చిన్నశ్రీనుని మందలించింది లేదు. మాట అడిగింది అంతకన్నా లేదు. అంతలా సత్తిబాబు ప్రేమించారు. కారణాలు ఏమైనా గావచ్చు ఇన్నేళ్ల తరువాత ఆ ప్రేమే ఎదురుతిరిగింది. నిజానికి ఇది సత్తిబాబుని మానసికంగా ఇబ్బందిపెట్టే అంశమే.

సరిగ్గా పదేళ్ల క్రితం జరిగిన ఒక వ్యూహఫలితంగా బావాబామ్మర్దుల మధ్య ఎడబాటు ప్రారంభమయ్యింది. అది కాస్త





పెరిగి పెద్దది అయ్యింది. అయినా బొత్స వెరవలేదు. కాల పరీక్షకు సిద్ధపడ్డారు. అన్నీ తెలిసినా నిబాయించుకుని ముందుకు నడిచారు. అలాంటి సమయంలో మొన్నటి ఎన్నికల నాడు నిర్వహించిన సభలో జగన్మోహన్ రెడ్డి బొత్స సత్యన్నారాయణ పేరు ప్రస్తావించిన క్షణాన విజయనగరం జిల్లా వాసులు చూపిన ప్రేమాభిమానాలకి ఉద్వేగానికి లోనయ్యారు. నిండు సభలో తన పట్ల జిల్లా వాసులు చూపిస్తున్న అత్మీయతకి కన్నీటి పర్యంతం అయ్యారు. అప్పట్లో అదొక సంచలనం అయ్యింది. రాష్ట్ర వ్యాపితంగా చర్చనీయాంశంగా మారింది. మళ్లీ ఇన్నాళ్లకి అటువంటి సన్నివేశం చీపురుపల్లిలో తటస్థించింది. కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాకముందే కార్యకర్తలు ఇచ్చిన భరోసా సత్తిబాబుని గుక్క తిప్పుకోనివ్వలేదు. "మీకు మేము ఉన్నాం" అని ధైర్యవచనాలు పలికారు. దీంతో ఒక్కసారిగా బొత్స కన్నీళ్లు పెట్టుకున్నారు. తేరుకునేందుకు చాలా సేపే పట్టింది. పక్కనే ఉన్న ఆయన కుమార్తె అనూష, మరో పక్క మాజీ ఎంపీ బెల్లాన ఎంత వారించినా ఆయన నెమ్మదించలేదు. చాలా సేపటికి సర్దుకున్నారు. "ఇక పై మీరు ఎవరూ ఎవరి వద్దకు వెళ్లనవసరం లేదు. నేను అందుబాటులోనే ఉంటా. ఎవరికి ఏ సమస్య వచ్చినా నేరుగా నా వద్దకు రండి అని భరోసా ఇచ్చారు. "అటూ ఇటూ ఉన్నవాళ్లు ఎవరైనా ఉన్నట్లయితే వాళ్లు ఎటో పక్క నిర్ణయం తీసుకోండని" తేల్చేశారు. "ఉంటే నమ్మకంగా ఉండండి. లేకుంటే వెళ్లిపోండి" అని స్పష్టం చేశారు.

ఎప్పుడూ ముచ్చట్లు, సరదా సంభాషణలు, పలకరింపులు, పలవరింతులు, సభ ప్రారంభం కాగానే పదునైన విమర్శలు, సూటైన జవాబులుతో గంభీరంగా కనిపించే బొత్స ...ఒక్కసారిగా కన్నీరు పెట్టుకోవడంతో ఆ సమావేశం ఉద్వేగభరితం అయ్యింది. అది కాస్త మరోసారి రాష్ట్ర స్థాయి చర్చకు దారితీసింది.

# లీప్ యాప్ లోపాలకు ఉపాధ్యాయులే బలిపశువులా?



అమరావతి: విద్యాశాఖలో లీప్ యాప్ వ్యవహారం ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోంది. సాంకేతిక సమస్యలతో యాప్ సక్రమంగా పనిచేయని పరిస్థితుల్లోనూ, పనులు పెండింగ్‌లో ఉన్నాయంటూ ఉపాధ్యాయుల పేర్లను జాబితాల రూపంలో వారి బృందాల్లో బహిరంగంగా ప్రదర్శించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిదో గుర్తించకుండా ఉపాధ్యాయులపై బాధ్యతను మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. పెండింగ్ జాబితాలను బహిరంగంగా ప్రదర్శించడం అధికారిక పర్యవేక్షణలో భాగమే అయితే అదే విధానం బాధ్యత వహిస్తున్న ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తించాల్సిందేనని ఉపాధ్యాయులు స్పష్టం చేస్తున్నారు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత హాజరు నమోదు చేయని ఉపాధ్యాయుల జాబితాలను బహిరంగంగా ప్రదర్శిస్తున్నప్పుడు, పాఠశాలల్లో మరుగుదొడ్ల తనిఖీలు, నివేదికలు పూర్తిచేయని వారి వివరాలను చూపిస్తున్నప్పుడు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన తనిఖీలు, నామినేషన్లు, నివేదికలు పూర్తికాని వారి పేర్లను పెండింగ్ జాబితాల్లో పేర్కొంటున్నప్పుడు.. అదే విధానాన్ని యాప్ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు ఉన్న అధికారుల విషయంలో ఎందుకు పాటించరని నిలదీస్తున్నారు. లీప్ యాప్‌లో వివరాలు నమోదు కావడం లేదా నవీకరణలు పూర్తికాకపోవడానికి కారణం ఉపాధ్యాయుడి నిర్లక్ష్యమా, సాంకేతిక సమస్యా, లేక పర్యవేక్షణ లోపమా అన్నది ముందుగా తేల్చాలని వారు కోరుతున్నారు. ఎక్కడ పని పెండింగ్‌లో ఉందో మాత్రమే కాకుండా.. ఎవరి పరిధిలో అది పెండింగ్‌లో ఉందో కూడా స్పష్టంగా వెల్లడించాలి అని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయుల పేర్లను మాత్రం బహిరంగంగా ప్రదర్శించి, సంబంధిత అధికారుల బాధ్యతలను మాత్రం ప్రశ్నించకపోవడం ఏ విధమైన సమానత్వమని వారు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులకు ఒక ప్రమాణం.. అధికారులకు మరో ప్రమాణమా? అని నిలదీస్తున్నారు. సాంకేతిక లోపం కారణంగా పని పూర్తికాకపోయినా దానికి ఉపాధ్యాయుడినే బాధ్యుడిని చేయడం సరికాదని పేర్కొంటున్నారు. ఉపాధ్యాయుల పేర్లను పెండింగ్ జాబితాల రూపంలో బహిరంగంగా ప్రదర్శించడం వారి గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదని వారు అంటున్నారు. పర్యవేక్షణ పేరుతో బాధ్యతను నిర్ణయించాలనుకుంటే అందరికీ ఒకే విధానం ఉండాలని స్పష్టం చేస్తున్నారు. పెండింగ్ జాబితా కావాలంటే అందరిదీ ఉండాలి.. బాధ్యత కావాలంటే అందరిదీ ఉండాలి.. పారదర్శకత కావాలంటే అందరికీ సమానంగా ఉండాలి అని డిమాండ్ చేస్తున్నారు. ముందుగా లీప్ యాప్‌లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించి, అనంతరం పనితీరుపై బాధ్యతను నిర్ణయించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. యాప్ సక్రమంగా పనిచేయని లోపానికి ఉపాధ్యాయులను బలిపశువులను చేయడం మానుకోవాలని, సాంకేతిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

## భారీ వర్షం.. రహదారులు జలమయం



**విజయవాడ:** వాయవ్య-పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆనుకొని ఉన్న దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాలపై అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాగల రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో, దక్షిణ కోస్తా తీరం వెంబడి 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. శని, ఆదివారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. మరోవైపు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శనివారం ఉదయం నుంచే వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. హఠాత్తుగా కురిసిన భారీ వర్షం కారణంగా నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయానికి వర్షం ముంచెత్తడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై చేరిన మోకాల్లోతు నీటితో వాహనదారులు, బాటసారులు తీవ్ర అవస్థలు పడ్డారు.

## ఫాస్టాగ్ వినియోగదారులకు శుభవార్త.. వాహనంపై ఉన్న ట్యాగ్ ఎప్పటికీ అలాగే..

**ఢిల్లీ** : ఫాస్టాగ్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త చెప్పింది. ఇకపై ఫాస్టాగ్‌కు అనుసంధానమైన బ్యాంకును మార్చుకోవాలంటే.. వాహనంపై ఉన్న ట్యాగ్‌ను తొలగించి కొత్తది తీసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది. 'వన్‌ట్యాగ్' విధానాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముంబ యిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ప్రారంభించారు. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ తరహాలో ఈ సేవ పనిచేస్తుంది. ప్రస్తుత బ్యాంకు సేవలు నచ్చకపోతే మరో బ్యాంకుకు ఫాస్టాగ్ ఖాతాను మార్చుకోవచ్చు. వాహనంపై ఉన్న ట్యాగ్ మాత్రం అలాగే ఉంటుంది. ఈ మార్పు ప్రక్రియను రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సహా పలు సంస్థలు ఇప్పటికే ఈ విధానంలో భాగమయ్యాయి. ఫాస్టాగ్ సేవల మార్పులో వాహనదారులకు ఎదురవుతోన్న ఇబ్బందులను తగ్గించడమే వన్‌ట్యాగ్ విధానం లక్ష్యమని గడ్కరీ తెలిపారు. గతంలో బ్యాంకు మార్చాలంటే పాత ఫాస్టాగ్ ఖాతాను మూసివేసి.. కొత్త ట్యాగ్ తీసుకోవాల్సి వచ్చేదని పేర్కొన్నారు.

## మద్యం షాపుల లైసెన్సుల పునరుద్ధరణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం** : జిల్లాలో 2024-26 మద్యం నూతన విధానం గడువు ఈ నెల 30తో ముగియనుండటంతో, వచ్చే ఏడాదికి మద్యం షాపుల లైసెన్సులను పునరుద్ధ రించుకునే వెసులుబాటు కల్పించినట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి నాయుడు శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. జిల్లా గజెట్ సంఖ్య 426 ద్వారా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. సాధారణ కేటగిరీ పరిధిలోని 158 దుకాణాలు, రిజర్వుడు విభాగానికి చెందిన 18 షాపుల లైసెన్స్ దారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు తమ దరఖాస్తులను ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ విధానంలో సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత లైసెన్స్ రుసుములో 38 శాతం అదనపు మొత్తం, లైసెన్స్ ఫీజులో 1/4వ వంతు, పర్మిట్ రూమ్ ఫీజులో 1/3వ వంతుతో పాటు ఐదు వేల రూపాయల ప్రాసెసింగ్ రుసుమును ఏకమొత్తంగా చలానా లేదా ఆన్‌లైన్ చెల్లింపుల రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేయని షాపులను ఎక్సైజ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేసి, ఈ నెల 30న జిల్లా కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా కేటాయిస్తామని వెల్లడించారు. సందేహాల నివారణకు శ్రీకాకుళం మధురానగర్ కాలనీలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని గానీ, స్థానిక ఎక్సైజ్ స్టేషన్లను గానీ సంప్రదించాలని కోరారు.

### 19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల డిసెంబర్ కోటా విడుదల

**తిరుమల:** డిసెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలైన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ కోసం 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో ఎంపికైన భక్తులు 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు సొమ్ము చెల్లిస్తే టికెట్లు మంజూరవుతాయి.

కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, పుష్పయాగం టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ఈ నెల 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శనం కోటా విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు డిసెంబర్ నెల ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను విడుదల చేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటా విడుదలవుతుంది. భక్తులు వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే సూచించింది.

**శ్రీవారి బ్రహ్మోత్సవాలు.. చంద్రబాబుకు ఆహ్వానం**

తిరుమల శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం చంద్రబాబును తితిదే ఆహ్వానించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నివాసంలో తితిదే బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, జానకిదేవి, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర తదితరులు సీఎంను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

# రివ్యూలు కాదు... రిజల్ట్స్ కావాలి

- ఆలోచనలతో పాటు... అమలూ ఉండాలి
- వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర
- కరవు ప్రాంతాలకు నీళ్లిస్తేనే నాకు సంతృప్తి
- రియాక్టివ్ నుంచి ప్రో యాక్టివ్ దిశగా అధికారులు పనిచేయాలి
- జిల్లాకు 25, నియోజకవర్గానికి 10-15 ప్రాధాన్యతాంశాలను గుర్తించాలి
- మభ్యపెట్టే విధంగా కాదు... వాస్తవ నివేదికలు కావాలి
- కలెక్టర్లు, అధికారులు, మంత్రుల మధ్య పోటీ ఉండాలి
- 8వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- సాగునీటి రంగంలో విశేష కృషి చేసి వాటర్ మ్యాన్‌గా నిలిచిన సీఎం చంద్రబాబుకు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో స్టాండింగ్ ఓవేషన్



**అమరావతి, సెప్టెంబర్** :-శాఖలు, అంశాలపై గంటల తరబడి రివ్యూలు చేయడం కాదు... రిజల్ట్స్ కావాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను.. అధికారులను నిర్దేశించారు. రాష్ట్ర సచివాలయంలో 8వ జిల్లా కలెక్టర్ల సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైంది. గురువారం తొలిరోజు సమావేశంలో జిల్లా కలెక్టర్లకు... అధికారులకు వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రజా సేవకులుగా ఉందాం... ఈగోలు వద్దు అంటూ కలెక్టర్లకు సూచించారు. గత సమావేశంలో నిర్ణయాలపై యాక్షన్ టేకెన్ రిపోర్టులు ఇక నుంచి తప్పనిసరి కావాలన్నారు. ఓనర్షిప్ తీసుకోగలిగితేనే... లీడర్షిప్ ఇవ్వగలరంటూ అంటూ మంత్రులకు, అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."27 నెలల్లో అనేక వ్యవస్థాగత మార్పులు చేశాం. ఆ ఫలితాలు కనిపిస్తున్నాయి. 28 కొత్త పాలసీలతో అవకాశాలను అన్ లాక్ చేశాం. రియాక్టివ్ గవర్నెన్స్ నుంచి ప్రో యాక్టీవ్ గవర్నెన్స్‌కు వెళ్లాలి. ఫైల్ పెండింగ్ అంటే అభివృద్ధి పెండింగే. ఫిర్యాదు పెండింగ్ అంటే ప్రజలకు న్యాయం పెండింగ్. విజన్ ఉన్నా.. దాన్ని అమలు చేయకుంటే... అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి. ఇప్పుడు కాలం మారింది... పనిచేస్తేనే సరిపోదు.. ఫేక్ ప్రచారాలకు కౌంటర్ కూడా ఇవ్వాలి. ఫేక్ ప్రచారం చేస్తుంటే లీడ్ తీసుకుని రియాక్ట్ అవ్వాలి. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు...వాస్తవాలు చెప్పాలి. రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్ మొత్తంగా 12 గంటలు జరుగుతుంది... ఇది చాలా కీలకం. సమస్యను దాచిపెడితే పెద్దది అవుతుంది... ఓపెన్‌గా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు... ప్రజలు మెచ్చే సుపరిపాలన కావాలి. శాఖలు పోటీ పడాలి. జిల్లాలు పోటీ పడాలి. సెక్రటరీలు పోటీ పడాలి, కలెక్టర్లు పోటీ పడాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ షేర్ చేసుకుందాం...బెస్ట్ పాలసీలు అమలు చేద్దాం. వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్... అదే స్వర్ణాంధ్ర."అని ముఖ్యమంత్రి అన్నారు.

**టీమ్ సక్సెస్‌తోనే అభివృద్ధి**

"ఈసారి లీడర్షిప్ అంశంపై కలెక్టర్ల సదస్సులో ప్రత్యేకంగా చర్చించాలి. కొన్ని చోట్ల లీడర్షిప్ లోపం ఉంది. ఉద్యోగుల సామర్ధ్యం పెంపు కోసం వివిధ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకూ 1.50 కోట్ల కోర్సులను సామర్థ్యాలను పెంచేందుకు నిర్వహించాం. డీప్ టెక్ గవర్నెన్స్ ఉంటే అనూహ్యమైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీని వినియోగించడం ద్వారా డేటా లేక్, అవేర్ లాంటి వ్యవస్థలతో నిర్ణయాల్లో వేగం పెరగాలి... సేవల్లో నాణ్యత పెంచాలి. గతంలో 50 ఏళ్లలో చేసే అభివృద్ధిని ఇప్పుడు 10-15 ఏళ్లలోనే సాధించేందుకు ఆస్కారం ఉంది. మనకు వనరులు ఉన్నాయి. టెక్నాలజీ అందుబాటులో ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా 27 నెలల్లో రాష్ట్ర ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాం. రూ.1.40 లక్షల కోట్లు సంక్షేమానికి, రూ.1.50 లక్షల కోట్లు అభివృద్ధికి ఖర్చు చేశాం. రాయలసీమ రైజింగ్, కోస్తాంధ్ర భవిష్యత్ కొత్త పుంతలు, ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరిట ప్రగతి కార్యక్రమాలు చేపట్టాం. హంద్రీనీవా, వెలిగొండ ఫేజ్ -1, పోలవరం ఎడమ కాలువ, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టులు పూర్తిచేశాం. పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికల్లా పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డును పూర్తి చేసి గుంటూరు, విజయవాడకు రాజధానిని కనెక్ట్ చేశాం. ఎకనామిక్ టైమ్స్ పత్రిక సీఈఓ టూ వాటర్‌మాన్ అంటూ కథనం రాసింది. సంతోషం కలిగింది. గ్లోబల్ డ్రీమ్ కేబినెట్లో నా పేరు వచ్చినప్పుడు, సీఈఓ సీఎం అన్నప్పుడు కూడా నేను ఇంత ఆనందించలేదు. రాష్ట్రంలోని భౌగోళిక అసమానతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి ఒత్తిడి ఉంది... దానిని సరిచేస్తూ నీటిని ఆయా ప్రాంతాలకు నీటిని ఇవ్వగలిగితే కలిగే సంతోషం వేరు. గోదావరి- కావేరీ- మహానది- గంగా లాంటి నదులు అనుసంధానమై వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే భారత అభివృద్ధి అన్ స్టాపబుల్. ఈ నీటి భద్రత, సంరక్షణా చర్యల్ని గుర్తించి వాటర్ మాన్ గా పేరు పెట్టినందుకు సంతోషంగా ఉంది. 36 ప్రాజెక్టులు చేపట్టేందుకు క్యాలెండర్ కూడా ఇచ్చాం. వాటిని పూర్తి చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉంది. ప్రధాని మోదీ, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారం అధికారుల తోడ్పాటుతో ఈ విజయాలను సాధించగలిగాం. ఇప్పటి దాకా సాధించిన ఏ ఒక్కరి వల్లో సాధ్యం కాలేదు.. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు.. ఇలా అందరి వల్ల సాధ్యమైంది.. ఈ విజయం టీమ్ సక్సెస్." అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**అవకాశాలను అన్ లాక్ చేయండి... అభివృద్ధి సాధించండి**

"మనకు ఉన్న అవకాశాలను అన్‌లాక్ చేయగలిగాం. ప్రతి శాఖలోనూ సంస్కరణలు తీసుకువచ్చాం. ప్రతి జిల్లాలోనూ 25 టాప్ ప్రాజెక్టులను గుర్తించాలి... నియోజకవర్గానికి 10-15 ప్రాజెక్టులను ప్రాధాన్యతగా గుర్తించి అభివృద్ధి చేయాలి. జిల్లాల్లో గ్రోత్ ఇంజన్లను గుర్తించి దానికి అనుగుణంగా సంపద, ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలి. కోనసీమ కొబ్బరికి, వరికి ఫేమస్ కానీ ఇప్పుడు ఆదాయంలో వెనుకపడింది. నూతన ఆదాయ మార్గాల్ని అన్వేషించాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ఏలూరు జిల్లా ఇప్పుడు అత్యుత్తమ జిల్లాగా మారింది. అందుకే అవకాశాలను అన్ లాక్ చేయాలని పదేపదే చెబుతున్నాను. ప్రతిస్పందించే పాలన ద్వారా సుపరిపాలన అందించాలి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలవాలి. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారంపై సత్వరం స్పందించాలి. జిల్లా కలెక్టర్లుగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి... మంచి జ్ఞాపకాలను మిగుల్చుకోవాలి. మా హయాంలో పలానా జిల్లాలో ఈ పని చేశామని ప్రతి కలెక్టర్ గర్వంగా చెప్పుకునేలా పనిచేయాలి. రియాక్టివ్ గవర్నెన్స్ కంటే ప్రో యాక్టివ్ గవర్నెన్స్ ఉండాలి. ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయంటే అంటే అభివృద్ధి-పాలన పెండింగ్ లో ఉన్నట్టే. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందినప్పుడే ప్రజల నుంచి సానుకూల స్పందన ఉంటుంది. నాకు పరిపాలన కంటే సుపరిపాలన ముఖ్యం. మంత్రులు, అధికారులు, కలెక్టర్లు ప్రభుత్వ సేవలు అందించే విషయంలో.. అభివృద్ధి సాధించే విషయంలో పోటీ పడాలి."అని ముఖ్యమంత్రి వివరించారు.

**నెలవారీ నివేదికలతో అభివృద్ధి ప్రయాణం**

"ప్రతి నెలా ఆర్థిక నివేదికను విడుదల చేసి ఎప్పటికప్పుడు లక్ష్యాలను బేరీజు వేసుకుంటున్నాం. ప్రతి మూడు నెలలకూ జీఎస్డీపీని కూడా లెక్కించి ప్రగతిలో ఎక్కడ ఉన్నామో చూస్తున్నాం. 2022-23 బేస్ ఇయర్ గా ప్రస్తుత ధరలకు అనుగుణంగా 13.44 శాతం వృద్ధి రేటు నమోదైంది. తయారీ రంగంలోనూ అభివృద్ధి నమోదు అయ్యింది. జీఎస్టీ వసూళ్లు కూడా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.25,450 కోట్ల మేర పెరిగాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణల్ని అమలు చేస్తున్నాం. 120 ఏళ్ల నాటి భూ సమస్యల్ని కూడా పరిష్కరిస్తున్నాం. 1908 నుంచి అమలాపురంలో గ్రౌండ్ రెంట్ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని 1,416 మందికి పట్టాలు ఇచ్చాం. 2027 నాటికి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసే బాధ్యత మనందరిది. పాలన అంటే గుడ్డిగా పనిచేయటం కాదు. వినూత్న ఆలోచనలు చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలి. బెస్ట్ పాలసీలు తెచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేయాలి. కొత్త ఆలోచన- కొత్త ఆవిష్కరణలతో అంతా కలిసి పనిచేద్దాం. ప్రస్తుతం 13.44 శాతం వృద్ధి నమోదైంది. దీనిని 15 శాతం దిశగా తీసుకెళ్దాం." అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ఇద్దరు మహిళా అధికారులకు సీఎం ప్రశంసలు

"కొందరు వ్యక్తులు ఫేక్ ప్రచారంతో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. వేగంగా స్పందిస్తే దానికి కౌంటర్ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. సరైన సమయంలో స్పందించకపోతే ఆ శిక్ష ప్రభుత్వానికి పడుతుంది. కొందరు రాజకీయాలు చేస్తూ తప్పు దోవ పట్టించే ప్రయత్నం జరుగుతోంది. డీఎస్సీ-2025లో ఎక్కడా తప్పు జరగలేదు. స్పోర్ట్స్ కోటాలో నిబంధనల ప్రకారమే ఉద్యోగాలిచ్చాం. కానీ కొందరు అదే పనిగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు. దీనిపై ఇద్దరు మహిళా అధికారులు చక్కగా స్పందించి కౌంటర్ ఇచ్చారు... వారిని అభినందిస్తున్నా. ఉద్యోగాలు వచ్చిన ఉపాధ్యాయులు కొండారెడ్డి బురుజు, విజయవాడ అంబేద్కర్ విగ్రహం, విశాఖ బీచ్ రోడ్డులో





ఆరోపణలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. దుష్ప్రచారం ఆపకపోతే వారి పార్టీని బంగాళాఖాతంలో కలుపుతామని నినదించారు. గత ప్రభుత్వం నిర్వాకంతో మార్కెట్టులోకి వచ్చిన జే బ్రాండ్ మద్యం వల్ల 30 వేల మంది చనిపోయారు. వారి ఆరోగ్యం కూడా దెబ్బతింది. కల్తీ బ్రాండ్లన్నీ రద్దు చేసి పారదర్శకంగా విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. విద్యుత్ టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేస్తున్నాం. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో కారణంగా నీటి భద్రత ఓ సవాలుగా మారింది. 54 శాతం లోటు వర్షపాతం ఈసారి రాష్ట్రంలో నమోదైంది. గతేడాది ఇదే సమయానికి రిజర్వాయర్లలో 85 శాతం నీటి నిల్వలు ఉంటే ఈసారి మాత్రం 57 శాతం మాత్రమే ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పోలవరం లాంటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. కేంద్ర ప్రాయోజిత పథకాలైన జల్ జీవన్ లాంటి మిషన్ను గత ప్రభుత్వం సరిగ్గా వినియోగించుకోలేదు. అవి చేసి ఉంటే నీటి భద్రతకు ఆస్కారం ఉండేది. ప్రతీ ఇంటికీ కుళాయి ద్వారా నీరివ్వగలిగే వాళ్లం. తాగు నీటి సరఫరా విషయంలో ఎలాంటి రాజీ లేదు. పీఎండీఎస్, ప్రకృతి సేద్యం ద్వారా ప్రతీ ఎకరానూ సాగులోకి తీసుకురావాలి. సంక్షోభంలోనే కలెక్టర్ల నాయకత్వం వెలుగు చూడాలి."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**సీఈఓ టు వాటర్ మ్యాన్**

ఎకనమిక్ టైమ్స్‌లో వచ్చిన వాటర్ మ్యాన్ ఆర్టికల్ గురించి కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. సాగునీటి రంగంలో సీఎం చంద్రబాబు చేస్తున్న కృషిని అభినందిస్తూ కలెక్టర్ల కాన్ఫరెన్సులో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..."నీటి వనరుల రంగంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం సాధించిన విజయాలను దేశం గుర్తించింది. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల గురించి వివిధ రాష్ట్రాల్లో చర్చ జరుగుతోంది. ఈ నిశ్శబ్ద పురోగతి వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్సులోనే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నీళ్లు ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు. అందుకే హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ ద్వారా నీళ్లు ఇవ్వగలిగాం. ఉమ్మడి రాష్ట్రంలో ఇజ్రాయెల్ నుంచి డ్రిప్ టెక్నాలజీని తీసుకువచ్చి రాష్ట్రంలో అమలు చేశాం. గతంలో రూ.16 మీటరు డ్రిప్ పైప్ ఖరీదు. ఇప్పుడు 30 ఏళ్ల ద్రవ్యోల్బణం తర్వాత రూ.1.60 పైసలకే దొరుకుతోంది. రాయలసీమ జిల్లాల్లో డ్రిప్ ద్వారా చేసిన సాగు, సృష్టించిన సంపదే దీనికి ఉదాహరణ. పట్టిసీమ ప్రాజెక్టును కొందరు వ్యతిరేకించారు. కానీ ఆదే ప్రాజెక్టు నుంచి ఇప్పటి వరకూ 500 టీఎంసీల నీటిని తరలించగలిగాం. ప్రకాశం బ్యారేజీని 200 సార్లు ఇప్పటి వరకూ నింపగలిగాం. డెల్టా ప్రాంతానికి నీరు ఇచ్చాం. ముఖ్యమంత్రి చంద్రబాబు సృష్టించిన నిశ్శబ్ద నీటి ప్రయాణాన్ని రాష్ట్ర ప్రజలు, దేశం కూడా గుర్తించింది. రైతుల గురించి సీఎం పడుతున్న నిరంతర తపనను ఎకనమిక్ టైమ్స్ పత్రిక వాటర్ మాన్ గా ఆయన్ను కీర్తిస్తూ కథనం రాసింది. ఇది సీఎం సాధించిన విజయం.. ముఖ్యమంత్రి విజయంలో ఏపీ అభివృద్ధి ఉంది." అని మంత్రి అన్నారు. కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గేర్ మార్చిన బొత్స

- చిన్నశ్రీను పార్టీ మారడంతో అలర్ట్
- 12న పార్టీ విస్తృతస్థాయి సమావేశ నిర్ణయం
- నియోజకవర్గ పార్టీ ఇన్ చార్జ్ లతో భేటీ
- మండల స్థాయి నాయకులతో వరస సమావేశాలు
- పునాదులు కదలకుండా నేరుగా రంగంలోకి దిగిన సత్తిబాబు
- సత్తిబాబు తీరు చూసి గతాన్ని గుర్తు చేసుకుంటున్న శ్రేణులు



**విజయనగరం** : బొత్స సత్యన్నారాయణ అప్రమత్తం అయ్యారు. నేరుగా రంగంలోకి దిగారు. పార్టీ పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎటువంటి లీకేజీలు లేకుండా చక్కదిద్దే ప్రయత్నాలు ప్రారంభించారు. వరస సమావేశాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాలలో పార్టీ పరిస్థితులు మీద వాకబు చేస్తున్నారు. అటుగాఇటుగా ఉన్నవాళ్లకి తేల్చి చెప్పేస్తున్నారు. ఉన్న వాళ్లతోనే రాజకీయం నడుస్తుందని కుండబద్ధలగొట్టేస్తున్నారు. ప్రధానంగా వైఎస్సార్సీపి పరంగా అయితే పరుగులు పెట్టిస్తున్నారు. మార్పులకు వడివడిగా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. నడుస్తున్న వ్యవహారాలన్నింటినీ పరిశీలిస్తుంటే...బొత్సా ఈజ్ బ్యాక్ ! అనిపిస్తోంది. దశాబ్దన్నర కాలం తరువాత గ్రామస్థాయి నాయకులతో బొత్స భేటీ అవుతున్నారు. క్షేత్ర స్థాయి పరిస్థితులు గురించి ఆరా తీస్తున్నారు. సరవేగంగా సాగుతున్న ఈ పరిణామాలతో జిల్లాలో రాజకీయ వేడిని పుట్టిస్తున్నారు.

నడుపుతున్న ఈ మంత్రాంగానికి ప్రధాన కారణం చిన్న శ్రీను పార్టీ మారడం. జిల్లా పరిషత్ ఛైర్మన్ గా, జిల్లా పార్టీ అధ్యక్షుడుగా వ్యవహరించిన చిన్న శ్రీను ఆకస్మిక మార్పే ఈ పరిస్థితికి కారణం. నిజానికి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ జిల్లాల్లో అనేక మార్పులు జరిగాయి. కార్పొరేషన్ మేయర్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, చివరికి ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలు కూడా గోడ దూకడాలు చోటుచేసుకున్నాయి. కాని, విజయనగరం జిల్లాలో మాత్రం అటువంటి జాడే కానరాలేదు. నెల్లిమర్ల, బొబ్బిలి నియోజకవర్గాలలో మాత్రం వైఎస్సార్సీపి నాయకులు కూటమికి జైకొట్టిన సందర్బాలు ఉన్నాయి. కాని, జిల్లా స్థాయిలో రాజకీయ ప్రభావం చూపే చేరికలు ఏమీ జరగలేదన్నది వాస్తవం. అయితే, కూటమి నాయకత్వం ఆ దిశగా ప్రయత్నించిందా అంటే ఆ ఛాయలూ కానరాలేదు. ఒక్క నెల్లిమర్లలో మాత్రమే జనసేన తన పట్టును పెంచుకునేందుకు ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకత్వాలను ఆకర్షించే పనిని చేపట్టింది. అంతకు మించి పెద్దగా మార్పులు ఊసేలేదు. ఇదంతా బొత్స చాణిక్యమేనని వర్ణించనక్కర్లేదు. చిన్నశ్రీను నాయకత్వ పటిమేనని వేరేగా చెప్పకోనక్కర్లేదు. అంతేకాకుండా టిడిపి అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థల పరంగా వైఎస్సార్సీపి పూర్తి స్థాయి అధికారాన్ని చెలాయించడం కూడా ఆ ఇద్దరి ఫలితమేనన్నది ముమ్మాటికీ వాస్తవం.

పార్టీ ఇంత పటిష్టంగా ఉండడం వలనే స్థానిక సంస్థల ఎన్నికల మీద ఆసక్తి నెలకొంది. రాజకీయ విశ్లేషకులను సైతం ఆకర్షిస్తోంది. అందునా జిల్లా పరిషత్ ఛైర్మన్ తో పాటు విజయనగరం కార్పొరేషన్ మేయర్, బొబ్బిలి మునిసిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయితీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్న ఆలోచనకు ఆస్కారమిస్తోంది. సరిగ్గా ఇటువంటి దశలో జెడ్పీ ఛైర్మన్ బరిలో తన కుమార్తె బొత్స అనూష నిలుస్తోందని బొత్స సత్యన్నారాయణ ప్రకటించడం రాజకీయంగా సంచలనమే అయ్యింది. కూటమి నాయకత్వానికి సవాల్ విసిరినట్లు అయ్యింది. గత అనుభవం రీత్యా టిడిపి అప్రమత్తం అయ్యింది. ఈ సారి ఎలాగైనా బొత్స కి చెక్ పెట్టాలని అనుకుంది. అనుకుంటున్న తరుణంలోనే పార్టీలోకి వచ్చేందుకు చిన్నశ్రీను ప్రయత్నించడం కలిసివచ్చినట్లు అయ్యింది. ఆరు నెలల నుంచి చిన్న శ్రీను ప్రయత్నిస్తున్నారని ప్రచారం లేకపోలేదు. కాని, జరిగిన చేరికను చూసినట్లయితే అంతా అకస్మికంగానే జరిగినట్లు కనిపిస్తోంది. పార్టీకి సాయంత్రం రాజీనామా చేయడం, అమరావతిలో టిడిపి కార్యాలయానికి చేరుకోవడం, ఆ రాత్రే పార్టీ కండువా కప్పుకోవడం వడివడిగా జరిగిపోయాయి. చేరిన సందర్భంలో చిన్న శ్రీను, ఆయన కుమార్తె సిరి సహస్ర మాత్రమే ఉన్నారు. ఇప్పటికైతే మరెవ్వరూ టిడిపిలో చేరలేదు. అయితే, మీడియా అడిగిన ప్రశ్నకు మాత్రం "చేరికలు గురించి చూద్దాం రానున్న రోజుల్లో" అని చర్చకు తెరదీశారు.

కీలకమైన ఈ మార్పుతో బొత్స సత్యన్నారాయణ అప్రమత్తం అయ్యారు. ప్రధానంగా తన సొంత నియోజకవర్గమైన చీపురుపల్లి, ఎస్ కోట, బొబ్బిలి నియోజకవర్గాలకు సంబంధించి పరిస్థితిని చక్కదిద్దేందుకు నేరుగా రంగంలోకి దిగారు. విశాఖలో పార్టీ సమావేశం ముగించుకుని జిల్లాకి నిన్నటి రోజున చేరుకున్నారు. నిన్న సాయంత్రం నుంచి సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. చీపురుపల్లి నుంచి మండల స్థాయి నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం నియోజకవర్గాల ఇన్ చార్జ్ లతో భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల మీద ప్రధానంగా చర్చించారు. ఈ నెల 12వ తేదీన వైఎస్సార్సీపి జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని



నిర్ణయం చేశారు. అన్ని స్థాయి నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యేటట్లు చూడాలని ఇన్ చార్జ్ లకు నిర్దేశించారు. నియోజకవర్గాలలో చిన్న శ్రీను ప్రాబల్యం గల గ్రామాల గురించి ఇన్ చార్జ్ ల నుంచి ఆరా తీశారు. తనకి ఉన్న సమచారాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంత నాయకులతో మాట్లాడుతున్నారు. ఈ ఉదయం అయితే చీపురుపల్లిలో గ్రామస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిస్థితి మీద ఓ అంచనాకి వచ్చారు.

నిన్నటి రోజు నుంచి బొత్స సత్యన్నారాయణ విరామం లేకుండా వ్యవహరిస్తున్నారు. ఒకనాటి జెడ్పీ ఎన్నికల ముందు నడిపిన రాజకీయాన్ని రుచి చూపిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో తనకి ఉన్న సంబంధాలన్నింటినీ సమీకరిస్తున్నారు. చిన్నశ్రీను పార్టీ మారడం వలన బొత్సకి షాక్, జగన్ కి బిగ్ షాక్ అన్న ప్రచారాన్ని తిప్పి కొట్టేందుకు తన రాజకీయ చాణిక్యానికి పదునుపెడుతున్నారు. ఎక్కడా పార్టీ పరంగా గానీ, తన బలగం పరంగా గానీ ఎక్కడా లీకేజీలు లేకుండా ప్యాచ్ వర్కును వేగవంతం చేశారు. కనీస స్థాయిలో కూడా రాజకీయ ప్రభావం ఉండదు అన్న సంకేతాలను ఇవ్వడం ద్వారా స్థానిక సమరానికి కాలు దువ్వాలని బొత్స వ్యూహరచనగా కనిపిస్తోంది.

# వీలునామా రాసుకున్నంత మాత్రాన ఆస్తి మీది కాదు!

**న్యూఢిల్లీ :** 'వీలునామా రాసుకున్నాం.. రిజిస్ట్రేషన్ కూడా చేయించాం.. ఇక ఆస్తిపై ఎలాంటి సమస్య ఉండదు' అనుకుంటే పొరపాటే. వీలునామా రిజిస్ట్రేషన్ చేయించినంత మాత్రాన అది న్యాయస్థానంలో పూర్తిగా రుజువైనట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వీలునామా ఎలా తయారైంది? దాన్ని ఆస్తి యజమాని స్వచ్ఛందంగానే అమలు చేశారా? సాక్షులు చట్టబద్ధంగా ధ్రువీకరించారా? వంటి అంశాలను కూడా పరిశీలించాల్సి ఉంటుందని పేర్కొంది. వీలునామా రిజిస్ట్రేషన్ చేయించడం వల్ల దానికి ప్రాధాన్యం ఉన్నప్పటికీ.. చట్టపరమైన ఇతర నిబంధనలు వర్తించకుండా పోవు. పత్రం సరైన విధంగా అమలైందని, సాక్షులు చట్టబద్ధంగా ధ్రువీకరించారని అవసరమైనప్పుడు న్యాయస్థానంలో నిరూపించాల్సి ఉంటుంది. సాధారణ వీలునామాకు కనీసం ఇద్దరు సాక్షుల ధ్రువీకరణ అవసరం. వారు కేవలం తమ సంతకాలు చేశామంటే సరిపోదు. వీలునామా అమలును తాము ఎలా చూశారు? చట్టం నిర్దేశించిన విధంగా ధ్రువీకరించారా? అనే విషయాలు కూడా నిరూపించాల్సి ఉంటుంది. వీలునామాను తయారు చేసిన పత్రరచయిత సంతకం చేశాడని మాత్రమే అతను సాక్షి అయిపోడు. పత్రాన్ని రాసిన వ్యక్తిగా సంతకం చేశాడా? లేక సాక్షిగా ధ్రువీకరించాలనే ఉద్దేశంతో సంతకం చేశాడా? అనేది అత్యంత కీలకం. ఈ తేడా ఆస్తి వివాదంలో కీలకంగా మారొచ్చు. వీలునామా చెల్లుబాటును ఎవరైనా ప్రశ్నించినప్పుడు.. అందుబాటులో ఉన్న సాక్షుల్లో కనీసం ఒకరిని న్యాయస్థానంలో విచారించే పరిస్థితి ఉంటుంది. ఆ సాక్షి కేవలం తన సంతకాన్ని గుర్తించడం మాత్రమే కాకుండా.. వీలునామా చట్టబద్ధంగా అమలైన తీరును కూడా వెల్లడించాల్సి ఉంటుంది. వీలునామా తయారైన సందర్భాలనూ న్యాయస్థానం పరిశీలించవచ్చు. ఆస్తి యజమానికి పత్రం గురించి పూర్తి అవగాహన ఉందా? తన ఇష్టప్రకారమే నిర్ణయం తీసుకున్నారా? ఎవరైనా ఒత్తిడి చేశారా? పత్రం తయారైన సమయంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి? వంటి అంశాలను మొత్తం పరిణామాల నేపథ్యంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వృద్ధాప్యంలో లేదా అనారోగ్య పరిస్థితుల్లో వీలునామా తయారు చేసినప్పుడు.. భవిష్యత్తులో ఆ వ్యక్తి నిర్ణయ సామర్థ్యం, స్వచ్ఛందతపై వివాదాలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల వీలునామా తయారీ సమయంలో చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటించడం అవసరం. ఆస్తి యజమానులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన విషయం ఇదే. వీలునామా పత్రం భద్రంగా ఉందా అన్నదానితో పాటు.. అవసరమైనప్పుడు దాన్ని న్యాయస్థానంలో చట్టబద్ధంగా నిరూపించగలమా? అన్నదీ ఆలోచించాలి. సాక్షుల వివరాలు, వారి సంతకాలు, పత్రం అమలు చేసిన విధానం వంటి అంశాలను జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. పళనాతాళ్ మరణానంతరం వారసులు వర్సెస్ అలమాతాళ్ మరణానంతరం వారసులు కేసులో ఆగస్టు 13న సుప్రీంకోర్టు ధర్మాసనం వీలునామా చెల్లుబాటు, అమలు, సాక్షుల ధ్రువీకరణ, న్యాయస్థానంలో రుజువు తదితర అంశాలను పరిశీలించింది. వీలునామా రాసుకోవడం మాత్రమే కాదు.. అది చట్టబద్ధంగా అమలైందని నిరూపించగలగడం కూడా అంతే ముఖ్యం. రిజిస్ట్రేషన్ ఉన్నంత మాత్రాన అన్ని న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవు. భవిష్యత్తులో కుటుంబ ఆస్తి వివాదాలకు తావులేకుండా వీలునామా తయారీలో ప్రతి నిబంధననూ జాగ్రత్తగా పాటించాలి.

## అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం

**అమరావతి:** అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం.. ఓటు వేయని వారినీ మార్చుకుందాం అని తెదేపా అధినేత, ముఖ్య మంత్రి చంద్రబాబు పిలుపు నిచ్చారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 2వ రోజు సుస్థిర అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని సూచించారు. 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, నీటి లభ్యత సమస్య కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

## పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

**అమరావతి:** పార్టీ పదవుల్లో ఉన్నవారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని, పార్టీనే సుప్రీం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఏదైనా పని చెబితే దానికే మొదటి ప్రాధాన్యమివ్వాలని లోకేశ్ తెలిపారు. "క్వాంటమ్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే... అదే సమయంలో పార్టీ అప్పగించిన పని ఉండటంతో అదే నాకు ముఖ్యమని చెప్పి, ఆ కార్యక్రమానికి వెళ్లలేదు" అని ఆయన సొంత అనుభవాన్ని వెల్లడించారు. "పార్టీ ఇచ్చిన పనుల్ని తప్పనిసరిగా చేయాల్సిందే. పార్టీ పదవుల్లో ఉన్నవారు.. పార్టీ కార్యక్రమాలకు రావడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు బీఫారం ఇవ్వకపోతే... ఇక్కడున్నవారెవరూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. "పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలి" అని కోరారు.

# '80ల ఫొటో' మోజు.. సైబర్ ముప్పు!

- ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండ్ పేరుతో వ్యక్తిగత చిత్రాల అప్‌లోడ్
- డీప్‌ఫేక్‌లు.. నకిలీ ఖాతాలు.. గుర్తింపు దుర్వినియోగం జరిగే ప్రమాదం



**శ్రీకాకుళం:** సోషల్ మీడియాలో ఏదైనా కొత్త ట్రెండ్ మొదలైతే చాలు.. వయసుతో సంబంధం లేకుండా నెటిజన్లు దాని వెంట పరుగు లు తీస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 1980ల నాటి రూపంలో ఫొటోలను మార్చుకునే ట్రెండ్ వైరల్‌గా మారింది. పాతకాలపు దుస్తులు, హెయిర్ స్టైల్, రంగులు, నేపథ్యంతో తమ చిత్రాలను ఏఐ ద్వారా మార్చుకుని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. సరదాగా కనిపిస్తున్న ఈ ట్రెండ్ వెనుక వ్యక్తిగత సమాచార భద్రతకు సంబంధించిన ముప్పు పొంచి ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### ఫొటో ఒక్కటే.. సమాచారం ఎంతో!

ఏఐ యాప్‌లు, వెబ్‌సైట్లలో ఫొటోలను అప్‌లోడ్ చేసే సమయంలో వినియోగదారులు నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఒకసారి చిత్రాన్ని అప్‌లోడ్ చేసిన తర్వాత అది ఎలా నిల్వ చేయబడుతుంది? ఎవరు ఉపయోగిస్తారు? ఎంతకాలం వారి సర్వర్లలో ఉంటుంది? వంటి విషయాలపై చాలామందికి అవగాహన ఉండటం లేదు.

### ముఖమే కీలక సమాచారం

సాధారణ ఫొటో కాదని.. మనిషి ముఖం కూడా ఒక రకమైన బయోమెట్రిక్ గుర్తింపు సమాచారమేనని నిపుణులు చెబుతున్నారు. స్పష్టమైన ముఖచిత్రాలు పెద్దఎత్తున అందుబాటులోకి వస్తే వాటిని భవిష్యత్తులో డీప్‌ఫేక్ చిత్రాలు, వీడియోలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించేందుకు దుర్వినియోగం చేసే అవకాశం ఉంటుంది.

### 'ట్రెండ్' పేరుతో తొందర వద్దు

తెలియని ఏఐ యాప్‌లు, వెబ్‌సైట్లలో వ్యక్తిగత చిత్రాలను అప్‌లోడ్ చేసే ముందు వాటి విశ్వసనీయతను పరిశీలించాలని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, ప్రముఖుల ఫొటోలను అనుమానాస్పద ప్లాట్‌ఫారాల్లో అప్‌లోడ్ చేయకుండా జాగ్రత్తపడాలని చెబుతున్నారు.

### జాగ్రత్తలే రక్షణ

- తెలియని ఏఐ యాప్‌లకు వ్యక్తిగత ఫొటోలు ఇవ్వొద్దు.
- యాప్ ప్రైవసీ పాలసీని పరిశీలించాలి.
- ఆధార్, పాన్, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాలతో ఉన్న చిత్రాలను అస్సలు అప్‌లోడ్ చేయకూడదు.
- సోషల్ మీడియాలో ఫొటోల ప్రైవసీ సెట్టింగ్ ను పరిమితం చేయాలి.
- అనుమానాస్పద లింకులు, యాప్‌లను ఉపయోగించకూడదు.
- తమ ఫొటోలను ఎవరైనా దుర్వినియోగం చేసినట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత వేదికకు ఫిర్యాదు చేసి, సైబర్ క్రైమ్ అధికారులను సంప్రదించాలి.
- ట్రెండ్ కోసం ఫొటోను మార్చుకోవడం తప్పుకాదు.. కానీ ఆ ఫొటో ఎక్కడికి వెళ్తుందో తెలియకుండా అప్‌లోడ్ చేయడం మాత్రం ప్రమాదకరం.

# జనసేన దూకుడు.. టీడీపీ మెలిక!





- బలం మాదే అంటున్న పవన్ పార్టీ..
- సీట్లు ఇచ్చేది మాత్రం బాబేనా?
- కమిటీల నివేదికలు ఓకే.. తుది నిర్ణయం చంద్రబాబు, లోకేశ్‌దేనంటున్న టీడీపీ వర్గాలు

**అమరావతి:** స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలన్న పట్టుదలతో ముందుకు సాగుతోంది. ఎక్కడ పార్టీ బలంగా ఉంది? ఏ స్థానాల్లో తప్పనిసరిగా పోటీ చేయాలి? ఎక్కడ మిత్రపక్షాలతో సమన్వయం అవసరం? అనే అంశాలపై క్షేత్రస్థాయి అంచనాలు వేస్తోంది. ఇందుకోసం రాష్ట్రస్థాయి కమిటీతో పాటు కింది స్థాయిలోనూ పలు కమిటీలను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఇటీవల మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఈ కమిటీల సభ్యులతో పాటు గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో చురుకుగా పనిచేసిన నేతలతో కీలక సమావేశం జరిగింది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, రామ్ తాళ్లూరి తదితర ముఖ్య నేతలు స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. దీంతో స్థానిక పోరులో జనసేన భారీగానే బరిలోకి దిగబోతోందన్న సంకేతాలు వెలువడ్డాయి.

### బలం మా దగ్గరేనా..?

అయితే జనసేన దూకుడును టీడీపీ నేతలు మరో కోణంలో చూస్తున్నారు. జనసేన ఏర్పాటు చేసిన కమిటీలు తమ బలాబలాలను అంచనా వేసి నివేదికలు ఇవ్వడం ఒక ఎత్తయితే.. ఆ నివేదికల ఆధారంగా సీట్లు కేటాయించడం మరో ఎత్తని అంటున్నారు. "ఫలానా చోట మాకు బలం ఉంది.. ఇక్కడ పోటీ చేస్తాం" అని జనసేన నేతలు చెప్పినంత మాత్రాన సీటు ఖరారైనట్టు కాదు అని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. జనసేన చెబుతున్న బలం వాస్తవమైనదా? క్షేత్రస్థాయిలో నిజంగానే గెలిచే పరిస్థితి ఉందా? లేక పార్టీ శ్రేణుల ఉత్సాహంలో చెప్పుకుంటున్న లెక్కలేనా? అనేది తేలాల్సి ఉందని అంటున్నాయి.

### కమిటీల నివేదికలు.. చివరి మాట ఎవరిది?

జనసేన కమిటీలు త్వరలో పవన్‌కల్యాణ్‌కు తమ నివేదికలు అందించనున్నాయి. ఏ నియోజకవర్గంలో, ఏ మండలంలో, ఏ స్థానిక సంస్థలో పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నాయన్న దానిపై ఈ నివేదికలు స్పష్టత ఇవ్వనున్నాయి. అయితే ఆ నివేదికలు వచ్చిన తర్వాత కూడా సీట్ల పంపకంపై తుది నిర్ణయం తీసుకునే అధికారం మిత్రపక్షాల అధినేతలదేనని టీడీపీ నేతలు చెబుతున్నారు. ముఖ్యంగా చంద్రబాబు, నారా లోకేశ్ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, గెలుపు అవకాశాలను బేరీజు వేసిన తర్వాతే సీటు కేటాయింపుపై నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. అంటే.. జనసేన కమిటీ ఒక చోట బలం ఉందని నివేదిక ఇచ్చిందంటే అక్కడ జనసేనకే సీటు దక్కుతుందని అనుకోవడానికి లేదన్నమాట.

### పవన్ దూకుడుకు టీడీపీ కళ్లెం?

జనసేన ప్రస్తుతం చేస్తున్న హడావుడిని తాము గమనిస్తున్నామని టీడీపీ నేతలు అంటున్నారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయడం, నేతల్లో ఉత్సాహం నింపడం కోసమే జనసేన నాయకత్వం పెద్ద ఎత్తున పోటీపై మాట్లాడుతోందని కొందరు టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు మిత్రపక్షాలకు ఎన్ని స్థానాలు ఇవ్వాలి? ఏ ప్రాంతాల్లో ఎవరికి అవకాశం ఇవ్వాలి? అన్నదానిపై టీడీపీ నాయకత్వం ఇప్పటికే ఒక అవగాహనకు వచ్చిందన్న ప్రచారం కూడా ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. అందువల్ల జనసేన కమిటీల నివేదికలు ఒక సూచన మాత్రమే.. సీట్ల కేటాయింపుపై తుది తీర్పు మాత్రం కూటమి పెద్దలదే అన్న సంకేతాలను టీడీపీ వర్గాలు ఇస్తున్నాయి. స్థానిక ఎన్నికల సమరానికి జనసేన ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించినా.. అసలు పరీక్ష మాత్రం "ఎన్ని సీట్లు అడుగుతుంది?" కంటే "ఎన్ని సీట్లు సాధిస్తుంది?" అన్నదే. ఇక మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటు సమయంలో జనసేన తన బలాన్ని ఏ మేరకు నిరూపించుకుంటుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తాం



**అమరావతి :** కేంద్రం సహకారం, రాష్ట్ర సంకల్పం, ప్రజల భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోనే నెం.1 స్థానం దక్కిందని సీఎం చంద్రబాబు అన్నారు. విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. 500 బెడ్లతో క్రిటికల్ కేర్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, తద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు గణనీయంగా ఖర్చు తగ్గుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సంజీవని ప్రాజెక్ట్ గేమ్‌ఛేంజర్‌గా మారబోతోందన్నారు.

"ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్‌గా మారబోతోంది. ఆయుష్మాన్ భారత్ పథకంతో చాలామందికి ప్రయోజనం చేకూరుతుంది. అర్హులైన వారికి రూ.5లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. జేపీ నడ్డా నాయకత్వంలో ఆరోగ్య రంగంలో కొత్త విప్లవాలు వచ్చాయి. ఆరోగ్య రంగంలో పెనుమార్పులకు డబుల్ ఇంజిన్ సర్కారే కారణం. 2047 నాటికి ప్రపంచంలోనే మన దేశం ప్రథమ స్థానంలో ఉండాలి" అని సీఎం అన్నారు.

ఏపీలో రూ.1,271 కోట్లతో 24 క్రిటికల్ బ్లాకులు, 25 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు, 33 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు నిర్మించబోతున్నామని కేంద్రమంత్రి జేపీ నడ్డా తెలిపారు. క్రిటికల్ కేర్ బ్లాక్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మాట్లాడారు. చంద్రబాబుతో కలిసి క్రిటికల్ కేర్ బ్లాక్‌లు, ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. "గత దశాబ్ద కాలంగా దేశంలో ఎన్నో ఆరోగ్య విధానాలు తీసుకొచ్చాం. ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందుకు గర్విస్తున్నా. ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనలో ఇదో ముందడుగు. ఇలాంటి కార్యక్రమాల రూపకల్పనలో కీలకపాత్ర పోషించిన చంద్రబాబుకు అభినందనలు. కొవిడ్ తర్వాత ఆరోగ్య వ్యవస్థలను పటిష్టం చేయడంపై మోదీ దృష్టి సారించారు. వచ్చే ఐదేళ్లలో రూ.64వేల కోట్లతో ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయబోతున్నాం. వంటగదే ఫార్మసీ, ఆహారమే ఔషధమని చంద్రబాబు తరచూ చెబుతారు.. అది అక్షరాలా నిజం" అని జేపీ నడ్డా పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో ఉమ్మడి జిల్లా నేతల ఉత్సాహం



**మంగళగిరి :** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన లీడర్‌షిప్ ట్రైనింగ్ కాన్‌క్లేవ్‌కు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు కీలక నేతలు హాజరయ్యారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమ, మంగళ వారాల్లో ఈ ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక దృష్టితో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జిలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర, జాతీయ స్థాయి బాధ్యతల్లో ఉన్న నేతలు సదస్సుకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడం, స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాల సాధన, ప్రభుత్వం-పార్టీ యంత్రాంగం మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు.

**నేతలకు సీఎం దిశానిర్దేశం :** మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ కీలక నేతలకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సదస్సులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు టీడీపీ ఎమ్మెల్యేలు బెందాళం అశోక్, గౌతు శిరీష, మామిడి గోవిందరావు, గొండు శంకర్, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అలాగే పలువురు పార్టీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సదస్సుకు హాజరయ్యారు. చర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి లంకా శ్యామ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీ-ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత పెంచడం, ప్రజా సమస్యలపై వేగంగా స్పందించడం, సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరువ చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై నేతలకు సదస్సులో అవగాహన కల్పించారు.

## ఉప్పుటూరి వీరరాఘవులు చిత్రపటానికి నివాళి



**సత్తెనపల్లి న్యూస్, నరసరావుపేట:** మండల పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో తెలుగు యువత నాయకుడు ఉప్పుటూరి అనిల్ పితృ వియోగంతో బాధపడుతున్న దృష్ట్యా, వారి నివాసంలో నిర్వహించిన ఉప్పుటూరి వీరరాఘవులు దశదిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ కోడెల శివరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరరాఘవులు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించిన కోడెల శివరాం, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. అనిల్ కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడెల శివరాంతో పాటు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు యువత ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యూరియా కలిసిన మేత తిని 18 ఆవులు మృతి



**సత్తెనపల్లి న్యూస్ మాదల (ముప్పాళ్ళ):** పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీ నాయకుడు, ముప్పాళ్ళ సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ డిసి చైర్మన్ గోగినేని కోటేశ్వరరావుకు చెందిన 18 ఆవులు యూరియా కలిసిన మేత తిని ప్రాణాలు కోల్పోయాయి. మాదల శివారులోని గోగినేని కోటేశ్వరరావుకు చెందిన 'అమరావతి గో సంరక్షణ శాల' షెడ్డులో ఈ దుర్ఘటన జరిగింది. నిన్న కురిసిన భారీ వర్షానికి షెడ్డులో నిల్వ ఉంచిన యూరియా కరిగి పశువుల మేతలో కలిసిపోయింది. ఈ విషయాన్ని గమనించకపోవడంతో, యూరియా ఉన్న చోటే మేత వేయగా.. దానిని తిన్న 18 ఆవులు షెడ్డులోనే ఒకేసారి మృత్యువాత పడ్డాయి. ఒకేసారి 18 ఆవులు మృతి చెందడంతో గో సంరక్షణ శాల వద్ద తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## బాపట్ల యస్‌బిఐ ఏటీఎంలో అగ్ని ప్రమాదం




**సత్తెనపల్లి న్యూస్ - బాపట్ల :** బాపట్ల పట్టణంలోని వన్ వే సెంటర్ సమీపంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో గురువారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఏటీఎం మెషీన్ నుండి ఒక్కసారిగా పొగలు, ఆ తర్వాత మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సకాలంలో స్పందించి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు నిర్వహించారు. చుట్టుపక్కల ట్రాఫిక్ ను క్లియర్ చేసి, ప్రజలు దగ్గరకు రానీయకుండా చర్యలు తీసుకున్నారు, కరెంట్ సప్లై నిలిపివేయించారు. ఈ తరుణంలో ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు పక్క షాపులకు వ్యాపించకుండా, పెను ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. అతి తక్కువ సమయంలోనే మంటలను అదుపులోకి తెచ్చారు.ఏటీఎం లోపల ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రాణ నష్టం తప్పింది. అయితే ఏటీఎం మెషీన్, ఏసీ, సీసీ కెమెరాలు దగ్ధమైనట్లు తెలుస్తోంది. అదృష్టవశాత్తు నగదు సేఫ్ గా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. పోలీసులు, ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించి ఉండకపోతే ప్రమాదం మరింత పెద్దది అయ్యేదని స్థానికులు అంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బలసాని ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం



**గుంటూరు (ఎస్ఏపిఎన్) :** గుంటూరు రూరల్ మండలం ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అధికారిక గుర్తింపు (ఐడీ) కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు షేక్ గులాం రసూల్ మాట్లాడారు. కష్టకాలంలో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు భరోసా ఇచ్చారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం దిశగా రాజీలేని పోరాటం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపడబోయే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. త్వరలోనే నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం మరియు గ్రామంలో కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు షేక్ గులాం రసూల్ తో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా 'మానవత' సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**సత్తెనపల్లి న్యూస్ :** మానవ సేవే మాధవ సేవని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అన్ని మతాలు బోధించే పరమార్థమని 'మానవత' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర కమిటీ చైర్మన్ ఎన్. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 'మానవత' స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. రామాయణం ధర్మాన్ని, మహాభారతం కర్తవ్యాన్ని, బైబిల్ ప్రేమను, ఖురాన్ సోదరభావాన్ని బోధిస్తున్నాయని తెలిపారు. గ్రంథాలు వేరైనా వాటి అంతరార్థం మాత్రం మానవత్వమేనని, సమాజానికి ఉపయోగపడేలా సేవ చేసేవారే నిజమైన శ్రీమంతులని చెప్పారు. అనంతరం ఎంఏఎం విద్యాసంస్థల అధినేత, సంస్థ పల్నాడు జిల్లా చైర్మన్ మేదరమెట్ల






శేషగిరిరావు నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గం చైర్మన్: జక్కుల లక్ష్మీనారాయణ, కో-చైర్మన్: ఆళ్ళ చంద్రశేఖర్, అడ్వైజర్ కమిటీ డైరెక్టర్: చలువాది చిన్న సత్యనారాయణ (న్యాయవాది), పట్టణ అధ్యక్షుడు : దివ్వెల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి: కుంభా వీరాంజనేయులు, కోశాధికారి (ట్రెజరర్):షేక్. అబ్దుల్ బషీర్, ఆత్మీయ కమిటీ చైర్మన్: గంజి వీరాస్వామి, కమిటీ సభ్యులు:షేక్. ఖాదర్ వలి, టి. అంజి రెడ్డి, వలేటి కుమారిఈ కార్యక్రమంలో డివిఎన్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దరువూరి నాగేశ్వరరావు, సంస్థ ఉమ్మడి గుంటూరు జిల్లా చైర్మన్ పావులూరి రమేష్, కేంద్ర కమిటీ డైరెక్టర్ రామానుజులు రెడ్డి, డాక్టర్ షకీలా శ్రీధర్ రెడ్డి, పోతుగంటి రామ కోటేశ్వరరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, పెరుమాళ్ళ లక్ష్మి శివన్నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఎన్ఆర్ఐ గహన్ జన్మదిన వేడుకలు

**సత్తెనపల్లి (ఎస్ఎపిఎన్) :** ప్రముఖ న్యాయవాది ఇరగంరెడ్డి ఎల్లారెడ్డి-మైథిలి దంపతుల మనవడు, రంగరాయరెడ్డి కుమారుడు ఎన్ఆర్ఐ ఇరగంరెడ్డి గహన్ జన్మదినం (ఆగస్టు 29) సందర్భంగా సత్తెనపల్లి పట్టణం మెయిన్ రోడ్డులోని సరస్వతి శిశుమందిర్‌లో శనివారం ఉదయం దాతృత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థులకు రూ. లక్ష రూపాయల ఆర్థిక సహాయంతో పాటు ఉపాధి పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యోగా గురువు పి. మారుతి రమేష్ మాట్లాడుతూ.ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా ఎల్లారెడ్డి కుటుంబం ప్రతి ఏటా పేద విద్యార్థులకు, నిరుపేదలకు ఆర్థిక సాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. గత ఏడాది కూడా రూ. 2 లక్షల ఉపకార వేతనాలు అందించారని గుర్తుచేశారు. ఇటీవల ఎల్లారెడ్డి అమెరికా నుంచి తిరిగి రావడంతో శనివారం ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ. లక్ష ఆర్థిక



సహాయాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇరగంరెడ్డి ఎల్లారెడ్డి, చలువాది చిన సత్యనారాయణ, బగ్గి నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, అన్నెం కృష్ణారెడ్డి, లేళ్ళ సాంబిరెడ్డి, అన్నెం యోగానంద శ్రీనివాసరెడ్డి, న్యాయవాద గుమస్తాల సంఘం అధ్యక్షుడు మర్రి నరసింహారావు, యోగా గురువు పి. రమేష్, పట్టణ పురప్రముఖులు మరియు 40 మంది యోగా సాధకులు పాల్గొన్నారు.

# పిడుగురాళ్లలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**పిడుగురాళ్ల (ఎస్ఎపిఎన్) :** శ్రావణమాసపు చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని పిడుగురాళ్ల పట్టణంలోని శ్రీ గంగమ్మ తల్లి ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక పర్వదినం సందర్భంగా అమ్మవారిని నయన మనో హరంగా, శోభాయమానంగా ప్రత్యేక అలం కరణలో తీర్చిదిద్దారు. ఉదయం నుంచే ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు మరియు సహస్ర నామార్చనలు వైభవంగా నిర్వహిం చారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రావణ మాసపు చివరి శుక్రవారం కావడం, దానికి తోడు అమ్మవారు విశేష అలంకర ణలో దర్శన మివ్వడంతో పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల నామస్మరణలతో మారుమోగింది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు, వాయనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## కన్నా లక్ష్మీనారాయణను పరామర్శించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

**గుంటూరు (ఎస్ఎపిఎన్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణను తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ శనివారం పరామర్శించారు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న కన్నా లక్ష్మీనారాయణను గుంటూరు నగరం: లోని ఆయన స్వగృహంలో శ్రావణ్ కుమార్ కలిసి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.



# స్థానిక ఎన్నికలపై సస్పెన్స్..

- జగన్ అనుమానాల వెనుక లెక్కేంటి?
- బాబు ప్లాన్ ఇదేనా..?

**సత్తెనపల్లి న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న వేళ.. అవి సకాలంలో జరుగుతాయా? లేక ఏదో ఒక కారణంతో వాయిదా పడతాయా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ఇదే అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక ఎన్నికలు నిర్వహించే విషయంలో 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని జగన్ ప్రధానంగా ప్రస్తావించారు. గతంలో తమ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు సంబంధించి తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు కొట్టివేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం బీసీలకు పెద్ద సంఖ్యలో పదవులు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిసినా.. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందని జగన్ ఆరోపించారు.

### రిజర్వేషన్లే అసలు చిక్కా?

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందని వైసీపీ వర్గాలు వాదిస్తున్నాయి. తెలంగాణలోనూ ఇలాంటి రిజర్వేషన్లకు సంబంధించి న్యాయపరమైన అంశాలు తెరపైకి వచ్చిన విషయాన్ని జగన్ ప్రస్తావించారు. అదే పరిస్థితి ఏపీలోనూ ఎదురయ్యే అవకాశం ఉందని తెలిసినా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ఆయన ఆరోపించారు. దీంతో స్థానిక ఎన్నికల నిర్వహణపై వైసీపీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. రిజర్వేషన్లపై న్యాయపరమైన వివాదం ఏర్పడితే.. ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావచ్చన్నది ఆ పార్టీ అంచనాగా కనిపిస్తోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉందనే సంకేతాలు ఇస్తోంది.

### 44 లక్షల ఓట్ల తొలగింపుపైనా జగన్ ప్రశ్నలు

స్థానిక ఎన్నికలతో పాటు ఓటర్ల జాబితాల అంశాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో సుమారు 44 లక్షల ఓట్లు తొలగించారని ఆరోపిస్తూ.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు ఎలా వెళ్తుందని ప్రశ్నించారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు, ఎన్నికల ప్రక్రియ.. ఈ మూడు అంశాలు కలిసొస్తే ఎన్నికల నిర్వహణపై న్యాయపరమైన, పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైసీపీ అంచనా వేస్తోంది. అయితే ఇవన్నీ రాజకీయ ఆరోపణలేనని, ఎన్నికల షెడ్యూల్ మరియు అధికారిక నిర్ణయాలే తుది విషయాన్ని స్పష్టం చేస్తాయని చెప్పాలి.



ఎన్నికలు పెట్టినా.. పెట్టకపోయినా సిద్ధమే!

మరోవైపు ఎన్నికలు వాయిదా పడతాయన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ.. వైసీపీ మాత్రం ఎన్నికలు జరుగుతాయనే అంచనాతోనే ముందుకు సాగాలని జగన్ పార్టీ నేతలకు సూచించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నికలు సాఫీగా జరుగుతాయన్న నమ్మకం తనకు లేదని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పడం, నిర్బంధించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటి రాజకీయ పరిణామాలను తాము చూస్తున్నామని జగన్ ఆరోపించారు. ఎన్నికలు ఎలా జరిగినా ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### కార్యకర్తల కోసమే ఈ పోరు

స్థానిక ఎన్నికలను కేవలం పదవుల కోసం జరిగే ఎన్నికలుగా చూడవద్దని జగన్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఇవి ప్రధానంగా కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని చెప్పారు. భవిష్యత్‌లో జరిగే 'కురుక్షేత్రం' మరింత కీలకమని పేర్కొంటూనే.. ప్రస్తుత స్థానిక ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మొత్తానికి.. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీసీ రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, న్యాయపరమైన అంశాలపై రాజకీయ వేడి పెరుగుతోంది. ఎన్నికలు వాయిదా పడతాయన్న జగన్ అంచనా నిజమవుతుందా? లేక ప్రభుత్వం అనుకున్న సమయానికే ఎన్నికలు నిర్వహిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



## పోలీసు అమరవీరుల త్యాగాలు అమోఘం

**నరసరావుపేట (ఎస్ఎపిఎన్):** పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేటలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎనలేనివని, వారిని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. అమరుల సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకే ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం ఎంతో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారి సామాజిక బాధ్యతను కొనియాడారు. ఈ రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ సొసైటీ మరియు నరసరావుపేట ఏరియా హాస్పిటల్ సౌజన్యంతో సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, వెల్ఫేర్ ఎల్.ఆర్ఐ గోపీనాథ్, హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ, ఎంట్ ఆర్ఐ యువరాజ్, బీడీ టీమ్ ఆర్ఐ ఎం.రాజా మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా లక్ష్మీదేవి పూజలు



**సత్తెనపల్లిఆధ్యాత్మిక (ఎస్ఏపిఎన్) :** స్థానిక గడియార స్తంభం వద్ద వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయంలో శ్రావణ మాస ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని లక్ష్మీదేవి పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు మరియు అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో పట్టణానికి చెందిన పలువురు పుర ప్రముఖులు, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విశేషంగా శ్రమించి, ఈ పూజా కార్యక్రమాన్ని సర్వాంగ సుందరంగా జరిపించి విజయవంతం చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల జయ జయధ్వానాలు, ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది.

## స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2026లో గుంటూరుకు రెండో ర్యాంకు

**సత్తెనపల్లి న్యూస్ :** కేంద్ర పర్యావరణ, అటవీశాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2026 ఫలితాల్లో 3-10 లక్షలలోపు జనాభా ఉన్న నగరాల్లో గుంటూరు జాతీయస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌తో కలిసి రెండో ర్యాంకు పంచుకొని రూ.50 లక్షల నగదు బహుమతిలో రూ.25 లక్షలు చేజిక్కించుకొంది. సోమవారం ఇక్కడి పర్యా వరణభవన్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జాతీయ హరిత ట్రెబ్యునల్ ఛైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, ఎయిర్‌క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్ ఛైర్‌పర్సన్ రాజేష్‌వర్మ, కేంద్ర పర్యావరణ, అటవీశాఖ కార్యదర్శి తన్మయ్‌కుమార్, సీపీసీబీ ఛైర్మన్ అమన్‌దీప్‌గర్గ్‌ల చేతుల మీదుగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రతినిధులు ఈ అవార్డును స్వీకరించారు. దేశవ్యాప్తంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ కింద ఉన్న 130 నగరాల్లోని వాయు నాణ్యత ప్రమాణాలపై సర్వే ఆధారంగా 10 లక్షలకుపైగా జనాభా ఉన్న 48 నగరాలు, 3-10 లక్షలలోపు జనాభా ఉన్న 42 నగరాలు, 3 లక్షలలోపు జనాభా ఉన్న 40 పట్టణాలకు ర్యాంకులు ప్రకటించారు. ఇందులో 10 లక్షలకు పైబడి జనాభా ఉన్న నగరాల్లో విజయవాడ 8, విశాఖపట్నం 21వ ర్యాంకు గెలుచుకున్నాయి. 2025 ర్యాంకులతో పోలిస్తే విజయవాడ 5 స్థానాలు మెరుగుపరుచుకోగా, విశాఖపట్నం 4 స్థానాలు కోల్పోయింది. 3-10 లక్షలలోపు జనాభా కేటగిరీలో గుంటూరు 4 స్థానాలు మెరుగుపరుచుకొని 2వ స్థానానికి ఎగబాకింది. నెల్లూరు 18 నుంచి 9కి, అనంతపురం 35 నుంచి 34 స్థానాలకు ఎదిగాయి.

## మాదల గ్రామంలో కొడవలితో దాడి

**సత్తెనపల్లి రూరల్ (ఎస్ఏపిఎన్ ):** ముప్పాళ్ళ మండలం పరిధిలోని మాదల గ్రామంలో ఇద్దరి వ్యక్తుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తన గురించి చెడుగా మాట్లాడుతున్నావనే నెపంతో ఒక వ్యక్తి మరొకరిపై కొడవలితో దాడి చేసిన



సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్ఐ పి. అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మాదల గ్రామానికి చెందిన షేక్ దమ్మాలపాటి హుస్సేన్ (22)పై అదే గ్రామానికి చెందిన షేక్ మాబు సుభాని మద్యం మత్తులో దాడికి దిగాడు. 'నా గురించి తప్పుగా ఎందుకు మాట్లాడుతున్నావ్' అని గొడవకు దిగి, వెంట తెచ్చుకున్న కొడవలితో దాడి చేశాడు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై దాడిని అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. బాధితుడు షేక్ దమ్మాలపాటి హుస్సేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.











## రాత్రి 10 దాటితే మైక్ బంద్



సత్తెనపల్లి : వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సత్తెనపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి డి.ఎస్.పి చైతన్య సూచించారు. మండపాల వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాత్రి 10 గంటల తర్వాత మైకులు, సౌండ్ సిస్టమ్‌లు తప్పనిసరిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.నిమజ్జన ఊరేగింపుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖ సూచనలు పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు మండప నిర్వాహకులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.























ప్రకటన కర్తలకు, పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, సత్తెనపల్లి న్యూస్ సిబ్బందికి మరియు యాజమాన్యానికి మీకు మీ కుటుంబ సభ్యులకు

**వినాయక చవితి శుభాకాంక్షలు**



























EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY SHAIK ABDUL GOUSE ALI, PRINTED AT USHASRI PRINTERS, 22-12-84, VOORAVARI STREET, LALAPET, GUNTUR DISTRICT. ANDHRAPRADESH.
PUBLISHED AT MAHANATI SAVITHRI ROAD, BESIDES SARADHA, GRANDHALAYAM, SATTENAPALLI-522403, GUNTUR DISTRICT. ANDHRAPRADESH. EDITOR: SHAIK ABDUL GOUSE ALI.